www.asthram.com
RNI : TGTEL/25/A1872

సామాన్యుడి
# అస్త్రం
తెలుగు దినపత్రిక

మంగళవారం
5 ఆగస్టు 2025
హైదరాబాద్

సంపుటి : 1 సంచిక : 7 పేజీలు : 08 వెల:2/-



## తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే..

- మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను సెటిల్ చేసుకోండి: సుప్రీంకోర్టు
- సమస్య పరిష్కారం కోసం ఓ కమిటీని ప్రతిపాదిస్తున్నాం
- ఆ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆలయ ట్రస్టు బోర్డుకు మధ్యవర్తిత్వం వహిస్తుంది




## తీవ్ర చిక్కుల్లో అనిల్ అంబానీ

- బ్యాంకులకు ఈడీ నోటీసులు
- మనీలాండరింగ్ కేసులో దర్యాప్తు చేపట్టిన ఈడీ
- మొత్తం 12-13 బ్యాంకులకు దర్యాప్తు సంస్థ నుంచి నోటీసులు
- వీటిల్లో పబ్లిక్ సెక్టార్‌తోపాటు ప్రైవేటు సెక్టార్ బ్యాంకులు



## ఐదేళ్లలో రూ.7.08లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేత..

- లోక్‌సభలో గణాంకాలను వెల్లడించిన మంత్రి..!
- దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు
- 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేత

## 'కాళేశ్వరం'పై చర్చించాకే
# చర్యలు
## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కేబినెట్ ఆమోదించింది
- ఊరు, పేరు, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలింది
- ఇది పూర్తి స్వతంత్ర కమిషన్.. అందరి అభిప్రాయాలు తీసుకొని నివేదిక ఇచ్చింది
- కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించాకే ముందుకెళ్తాం
- అసెంబ్లీలో అందరూ స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పొచ్చు
- ఇందులో ఎలాంటి రాజకీయ కక్ష సాధింపు చర్యలుండవు
- మంత్రివర్గ సమావేశం తరువాత మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి



**హైదరాబాద్**

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో ఎలాంటి రాజకీయ జోక్యం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నివేదికను అసెంబ్లీలోపెట్టి చర్చించి, అందరి అభిప్రాయాలు తీసుకున్న తరువాత ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని చెప్పారు. ఇది స్వతంత్ర కమిషన్ ఇచ్చిన నివేదిక అని, సిఫార్సుల ఆధారంగా చర్యలు ఉంటాయి తప్ప.. ఎలాంటి కక్షపూరిత చర్యలకు తావులేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. - మిగతా3లో



## త్వరలో అసెంబ్లీ సమావేశాలు

- ప్రధానంగా కాళేశ్వరం కమిషన్ నివేదికపైనే అసెంబ్లీలో చర్చించే అవకాశం
- కాళేశ్వరంపై అవతవకలపై ఏర్పాటు చేసిన కమిషన్..
- తుది నివేదికను కొన్ని రోజుల క్రితం ప్రభుత్వానికి అందించింది
- 650 పేజీల కాళేశ్వరం నివేదికను 60 పేజీల సారాంశంగా తయారు చేసింది
- క్యాబినెట్‌కు సమర్పించిన ఈ సంక్షిప్త నివేదికలో 32 సార్లు కేసీఆర్, 19 సార్లు హరీశ్‌రావు, 5 సార్లు ఈటల రాజేందర్ ప్రస్తావన వచ్చినట్లు సమాచారం.

## భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న టెస్లా

- భారత్ లో రెండో షోరూం ప్రారంభించనున్న టెస్లా...
- ముంబై తర్వాత ఢిల్లీలో రెండో షోరూం ఏర్పాటు
- ఆగస్టు 11న ఏరోసిటీలో ప్రారంభం కానున్న ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- ప్రస్తుతం మోడల్ వై కారు మాత్రమే విక్రయం
- దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లకు అవకాశం




## నల్గొండను విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతాం

**రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.**

**నల్గొండ:**



నల్గొండ జిల్లాను విద్యా హబ్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రో డ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. అన్ని వర్గాల విద్యార్థులకు ఉత్తమమైన చదువులను అందించాలన్న లక్ష్యంతో నల్గొండ జిల్లా కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల రాష్ట్రంలోనే మొదటిది కావాలన్నారు. 9 నెలల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. సోమవారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని గంధం వారి గూడెంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు - మిగతా3లో

## రాష్ట్రపతితో గంటల వ్యవధిలో మోదీ, అమిత్ భేటీలు.. అందుకేనా?




## అంతర్జాతీయంగా విస్తరిస్తున్న అదానీ..

- వియత్నాంలో భారీ పెట్టుబడులు
- వియత్నాంలో 10 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులకు అదానీ గ్రూప్ ప్రణాళిక
- పోర్టులు, ఇంధనం, లాజిస్టిక్స్ రంగాలపై ప్రధానంగా దృష్టి
- వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ నేతలతో గౌతమ్ అదానీ భేటీలో వెల్లడి
- డా నాంగ్‌లోని లీన్ చియు పోర్ట్ ప్రాజెక్టుపై ప్రత్యేక ఆసక్తి
- అంతర్జాతీయంగా వ్యాపార విస్తరణలో భాగంగా ఈ కీలక నిర్ణయం

# జనంలోకి వెళ్దాం.. అసెంబ్లీలో ఎండగడదాం

- కాంగ్రెస్ అబద్ధాలకు 'కాళేశ్వరం' కమిషన్ ముసుగు తొడిగారన్న కేసీఆర్
- ఏళ్లుగా బీఆర్‌ఎస్‌పై చేస్తున్న విమర్శలనే నివేదికలో పొందుపరిచారు
- ఎర్రవల్లిలో పార్టీ ముఖ్యనేతలతో భేటీలో కేసీఆర్
- అసెంబ్లీకి హాజరై వాస్తవాలను వివరించే యోచన
- అవసరమైతే సుప్రీంను ఆశ్రయించాలనే భావన
- నేడు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్న హరీశ్‌రావు



**హైదరాబాద్**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో రెండు పియర్స్ కుంగుబాటును సాకుగా చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం ప్రాజెక్టు స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. గతంలో ప్రతిపక్ష పార్టీగా, నేడు అధికార పార్టీగా కాంగ్రెస్ వల్లెవేస్తూ వస్తున్న అబద్ధాలకు పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ముసుగు వేసి బీఆర్‌ఎస్‌పై బురద చల్లే ప్రయ త్నం చేస్తోందని దుయ్య బట్టారు. కాంగ్రెస్ అబ ద్ధాలను అసెంబ్లీతోపాటు ప్రజాక్షేత్రంలోనూ ఎండగట్టాలని పార్టీ నేతలను ఆదేశించారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై- మిగతా3లో

## తెలంగాణలో భారీ వర్షాలు



- హెచ్చరించిన వాతావరణశాఖ
- ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ
- 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశాలు

**హైదరాబాద్**

తెలంగాణలోని పలుచోట్ల ఈ నెల 8 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు తీరం వెంట - మిగతా3లో

# 'కాళేశ్వరం'పై చర్చించాకే చర్యలు..

-మొదటిపేజీ తరువాయి

కమిషన్ ఇచ్చిన నివేదికపై నీటిపారుదల, న్యాయ, సాధారణ పరిపాలన శాఖలకు చెందిన ముగ్గురు కార్యదర్శులతో కమిటీ వేసి, సంక్షిప్త నివేదిక రూపొందించినట్లు చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కమిషన్ నివేదికపై కూలంకషంగా చర్చించి ఆమోదం తెలిపింది. అనంతరం రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోవడంపై అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ చేపడతామని ఎన్నికలప్పుడు ప్రజలకు హామీ ఇచ్చా మని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. దాని ప్రకారమే న్యాయరంగంలో విశేష అనుభవం ఉన్న ఉమ్మడి ఏపీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, తొలి లోక్‌పాల్‌గా వ్యవహరించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆధ్వర్యంలో కమిషన్‌ను నియమించామని గుర్తుచేశారు. ఈ కమిషన్ 16 నెలలపాటు అందరి అభిప్రాయాలు తీసుకుని 665 పేజీల నివేదికను రూపొందించిందని, దీన్ని మంత్రివర్గం ఆమోదించిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'ఊరు, పేరు, అంచనాలు మార్చి అవినీతికి పాల్పడి అక్రమాలకు పునాదులు వేసి నిర్మించిన కాళేశ్వరం కూలిపోయింది. ఈ విషయాన్ని కమిషన్ స్పష్టంగా తన నివేదికలో పొందుపర్చింది. రాజకీయ నేతలు, ఇంజనీర్లు, ఐఏఎస్‌లు, నిపుణులు, ప్రజా సంఘాలు, ప్రజలు, పాత్రికేయుల నుంచి సమాచారం సేకరించడమేకాక, వారి వాదనలను పరిగణనలోకి తీసుకుంది. మంత్రివర్గం ఆమోదించిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి, అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలను, ప్రతిపక్ష నాయకుడు, అప్పటి నీటిపారుదల మంత్రి, ఇతర మంత్రుల అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి అవకాశం కల్పిస్తాం. దీనిపై సభ్యులకు పూర్తి అవగాహన కల్పిస్తాం. తొందరలోనే సభ ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను విన్నాకే ప్రభుత్వం ముందుకెళ్తుంది' అని సీఎం చెప్పారు.

**నోటీసులు ఇచ్చి.. వాదనలు విన్న కమిషన్**

'కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక భూమిక పోషించిన అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఐఏఎస్ అధికారులు, ఇంజనీర్లు, నిర్మాణ సంస్థలకు నోటీసులు ఇచ్చి వారికి తమ వాదనలు వినిపించడానికి కమిషన్ పూర్తి అవకాశం కల్పించింది. దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాణహిత%-%చేవేళ్లకు గోదావరి నీళ్లు తీసుకుని రావడానికి ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన ఏడాదిన్నర తరువాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రీడిజైన్ పేరిట ప్రాణహిత%-%చేవేళ్ల ప్రాజెక్టు స్థలం తుమ్మిడిహెట్టి నుంచి మార్చి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిన మూడేళ్లల్లోనే మేడిగడ్డ కుంగడం, అన్నారం, సుందిళ్ల పగలడం జరిగింది. ప్రణాళిక, నిర్మాణ, నిర్వహణ లోపాలు ఉన్నాయని నిపుణులు నివేదించారు. ప్రాజెక్టులు ప్రమాదంలో పడ్డాయని సాంకేతిక నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో సహా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు గుర్తించి వాటి మీద విచారణ చేశాయి. ఆ విచారణలో ప్రణాళిక, నిర్మాణ, నిర్వహణలో లోపాలు ఉన్నాయిని తేల్చాయి. దీని మీద పూర్తిస్థాయి విచారణ జరగాలని ఆనాటి ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చాయి. మా పార్టీ నాయకుడు రాహుల్ గాంధీతోపాటు టీపీసీసీ అధ్యక్షుడిగా నేను, మా కాంగ్రెస్ నాయకులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, ఉత్తమకుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టులను సందర్శించాం. లోపభూయిష్టమైన నిర్ణయాలు, అవినీతి, అశ్రిత పక్షపాతం నిర్లక్ష్య వైఖరి ఎన్నో లోపాలతో కూడుకున్న నిర్ణయాల వల్ల రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా కూలిపోయింది' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**అనుకూలమైతే ఒకలా.. లేదంటే మరోలా..**

నివేదికలు తమకు అనుకూలంగా ఉంటే ఒకలా.. లేదంటే మరోలా మాట్లాడడం బీఆర్‌ఎస్ నాయకులకు అలవాటేనని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కమిషన్ నివేదికను వారు తప్పుపట్టడం సహజమేనని వ్యాఖ్యానించారు. ఇది రాజకీయ నివేదికనో, ప్రభుత్వ నివేదికనో కాదని, ఇది స్వతంత్ర కమిషన్ ఇచ్చిన నివేదిక అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎవరు ఏ రకమైన విశ్లేషణలు చేస్తారన్నది వారి విజక్షతకే వదిలేస్తున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తన బావ (హరీశ్‌రావు) అవినీతి చేశారని, ఇందులో ఎవరెవరు కుమ్మక్కయ్యారో కవిత.. జస్టిస్ చంద్ర ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చి ఉంటే బాగుండేదని సీఎం వ్యాఖ్యానించారు. కవిత అప్పుడు మాట్లాడకుండా, ఇప్పుడు ఇక్కడ ప్రశ్నించడం ఎందుకని, కోల్‌కతాకు వెళ్లి అడగమనండి అని పేర్కొన్నారు. కమిషన్ నివేదికపై ఊహాజనిత వార్తలు, కల్పనకు అవకాశం ఉండకూడదనే ఏ శషభిషలు లేకుండా అన్ని విషయాలను స్పష్టంగా మీడియాకు చెప్పానన్నారు.

# నల్గొండను విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతాం

-మొదటిపేజీ తరువాయి



మంత్రి భూమి పూజ నిర్వహించారు.నల్గొండ జిల్లాలోని విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి చేపట్టిన బృహత్తర పాఠశాల యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల అని, రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం 20,000 కోట్ల రూపాయలతో ఇలాంటి పాఠశాలలను డిజైన్ చేసి నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోనే నల్గొండ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల మొదటిదని ,ఇది రికార్డు కావాలన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పోటీపడి ఈ పాఠశాల నిర్మాణాన్ని అంతకన్నా బాగా తీర్చిదిద్దాలని చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాల పక్కనే మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్ ఉన్నాయని, నల్గొండ లో అన్ని హంగులతో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉందని, నల్గొండ జిల్లాను విద్యా హబ్ గా మార్చడానికి కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ఇటీవలే ఎం ఫార్మసీ ,ఎల్ఎల్ బి కోర్సులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతామన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని, మధ్యలో బడి మానివేయవద్దని అన్నారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారని, వారందరినీ ఇలాంటి ఉత్తమమైన పాఠశాలల్లో చదివించి వారికి ఇక్కడే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, విద్య ,ఉపాధిలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ స్థానంలోనిలిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంతున్నదని తెలిపారు. ప్రస్తుతం నల్గొండలో బాలికలకు ఉద్దేశించి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు కాగా, బాలురకు కూడా ఇలాంటి పాఠశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గం లో కూడా త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నల్గొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను 25 ఎకరాలలో నిర్మించనున్నామని, ఈ పాఠశాలలో మంచి ఫ్యాకల్టీ తో పాటు, అన్ని వెసులుబాట్లు ఉంటాయని, పాఠశాల భవనాలు నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు అడ్వాన్స్ గా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలకు మంచి స్థలాన్ని గుర్తించడం జరిగిందని, త్వరలోనే అక్కడ శంకుస్థాపన పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రొఫెషనల్ గా తయారవ్వడానికి అవకాశం ఉంటుందని, ఈ పాఠసాల విద్యార్థుల జీవితాల్లో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.టి జి ఈ డబ్ల్యు ఎం ఐ డి సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాల ప్రసాద్, నల్గొండ లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల వివరాలను తెలియజేశారు.అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్ నారాయణ అమిత్, నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, విద్యాశాఖ అధికారి బిక్షపతి, టి జి ఈ డబ్ల్యు ఐ డి సి డి ఈ శైలజ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మల మోహన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## త్వరలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్:** త్వరలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. సోమవారం తెలంగాన కేబినెట్ సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన అనంతరం అసెంబ్లీని నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా అసెంబ్లీలో కాళేశ్వరం రిపోర్ట్‌పై చర్చించనున్నారు. కాళేశ్వరం నివేదికపై అసెం బ్లీలో చర్చలు అనంతరం దర్యాప్తు సంస్థలకు అప్పగించాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా కాళేశ్వరం కమిషన్ నివేదికపైనే అసెంబ్లీలో చర్చించే అవకాశం ఉంది. కాళేశ్వరంపై అవతవకలపై ఏర్పాటు చేసిన కమిషన్.. తుది నివేదికను కొన్ని రోజుల క్రితం ప్రభుత్వానికి అందించింది. ఈ నేపథ్యంలో నేటి కేబినెట్ సమావేశంలో కూడా దీనిపైనే ప్రధానంగా చర్చించారు. మరోవైపు.. కాళేశ్వరంలో ఎక్కడా అవినీతి జరగలేదని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. డిజైన్‌లో లోపాలు లేవని అంటున్నారు. అది కాంగ్రెస్ కమిసన్ అని వారు విమర్శిస్తున్నారు. వ్యాప్కో సంస్థ సూచనల మేరకు ప్రాజెక్టు నిర్మాణం జరిగినట్టు తెలిపారు. కాగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పార్టీ నేతలు ఈరోజు సమావేశమ య్యారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్‌తో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి భేటీ అయ్యారు. ప్రభుత్వానికి కాళేశ్వరం కమిషన్ అందించిన నివేదికపైనే ఈ భేటీలో బీఆర్ఎస్ నేతలు చర్చించినట్లు తెలుస్తోంది.

## తెలంగాణలో భారీ వర్షాలు..

-మొదటిపేజీ తరువాయి

సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. తూర్పు-పశ్చిమ ద్రోణి తూర్పు మధ్య అరేబియా సముద్రం దక్షిణ భాగాల నుంచి దక్షిణ ఇంటీరియర్ కర్నాటక, తమిళనాడు మీదుగా మధ్య బంగాళాఖాతం తీర ప్రాంతంలోని ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతుందని.. సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొద్దీ దక్షిణం వైపు వంగి ఉందని పేర్కొంది. సోమవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని చెప్పింది. బుధవారం నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. గురువారం మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో.. శుక్రవారం నల్గొండ, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# ఐదు రాష్ట్రాలు బాగుపడేది ఎప్పుడు

**న్యూఢిల్లీ :** బీమార్.. లేదా బీమారీ.. ఈ పదం ఎక్కువగా తెలంగాణలో వాడతారు. ఉర్దూ పదమైన బీమార్ అంటే.. రోగం అని అర్థం. కరలా, ఇతర వ్యాధులు ప్రబలిన సమయంలో దీనిని ఎక్కువగా వాడారు. అయితే ఇప్పుడు ఉత్తరాదికి చెందిన మూడు ఉమ్మడి రాష్ట్రాలను బీమార్ రాష్ట్రాలుగా పిలుస్తున్నారు. బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు రాజకీయంగా దేశాన్ని శాసించే స్థాయిలో ఉన్నప్పటికీ, ఆర్థిక, సామాజిక పురోగతిలో వెనుకబడి ఉన్నాయి. అందుకే ఈ రాష్ట్రాలను ఆర్థికవేత్తలు (బీమార్ = అనారోగ్యం) రాష్ట్రాలుగా పేర్కొంటారు, ఇది వీటి అభివృద్ధి స్థాయిని సూచిస్తుంది.బీమార్ రాష్ట్రాలు జనాభా పరంగా దేశంలోనే అత్యధిక భాగాన్ని కలిగి ఉన్నాయి, కానీ ఆర్థిక సూచికల్లో వెనుకబడి ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో పేదరికం, నిరుద్యోగం, పోషకాహార లోపం వంటి సమస్యలు ఇప్పటికీ ప్రబలంగా ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అభివృద్ధి అంతరం ఎక్కువగా ఉంది. పట్టణ కేంద్రాలలో కొంత మెరుగైన సౌకర్యాలు ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాలు ఇప్పటికీ విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ రాష్ట్రాలలో పారిశ్రామికీకరణ స్థాయి తక్కువగా ఉంది. ఈ కారణంగా స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పరిమితం, యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోంది. ఈ రాష్ట్రాలలో మానవాభివృద్ధి సూచిక దేశ సగటు కంటే తక్కువగా ఉంది.బీమార్ రాష్ట్రాలు ఎందుకు ఇప్పటికీ అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి? దీనికి చారిత్రక, రాజకీయ, మరియు సామాజిక కారణాలు ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం ఈ రాష్ట్రాలలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పరిమితంగా ఉండటం వల్ల పారిశ్రామికీకరణ వెనుకబడింది. బ్రిటిష్ పాలనలో కూడా ఈ ప్రాంతాలు పెద్దగా అభివృద్ధి చెందలేదు. ఈ రాష్ట్రాలలో గత కొన్ని దశాబ్దాలలో రాజకీయ అస్థిరత, అవినీతి, స్వలాభాపేక్షలు అభివృద్ధి పథకాల అమలును దెబ్బతీశాయి. అధిక జనాభా వృద్ధి రేటు వల్ల విద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాలు అందించడంలో ప్రభుత్వాలు తడబడుతున్నాయి. ఈ రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి ఉంది, కానీ ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగునీటి సౌకర్యాల కొరత వల్ల ఉత్పాదకత తక్కువగా ఉంది.ఈ బీమార్ రాష్ట్రాల నుంచి దక్షిణ భారత రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వలసలు గణనీయంగా పెరిగాయి. ఈ వలసలకు ఆర్థిక పరిస్థితి ఒక కీలక కారణం. దక్షిణ రాష్ట్రాలలో ఐటీ, తయారీ, సేవా రంగాలలో ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉన్నాయి.

## జనంలోకి వెళ్దాం.. అసెంబ్లీలో ఎండగడదాం

-మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రవల్లి నివాసంలో కొన్ని రోజులుగా పార్టీ కీలక నేతలు కె. తారక రామారావు, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో వరుస భేటీలు జరుపుతున్న కేసీఆర్.. సోమవారం కూడా వారితో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. బీజేపీ ప్రేరేపిత జాతీయ డ్యామ్‌ల భద్రత ప్రాధికార సంస్థ (ఎన్డీఎస్ఏ)ను అడ్డుపెట్టుకొని తయారు చేయించిన నివేదికపై ప్రజలకు వాస్తవాలు వివరించాలని కేసీఆర్ ఆదేశించినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

**అసెంబ్లీ వేదికగానే అసలు నిజాలు చెబుదాం**

పీసీ ఘోష్ కమిషన్ నివేదికను త్వరలో అసెంబ్లీ ఉభయ సభల్లో ప్రవేశపెట్టి చర్చిస్తామని సీఎం రేవంత్ చేసిన ప్రకటనపై ఈ భేటీలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. గతంలో అధికారపక్షంగా రాష్ట్రంలో సాగునీటి రంగం స్థితిగతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో ప్రజలకు వివరించినట్లుగానే కమిషన్ విచారణ నివేదికపైనా స్పందించాలని కేసీఆర్ అభిప్రాయపడ్డట్లు తెలియవచ్చింది. ఈ అంశంపై తానే అసెంబ్లీకి స్వయంగా హాజరై వాస్తవాలను ప్రజల ముందు పెట్టాలనే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఏ తప్పూ చేయనందునే పీసీ ఘోష్ కమిషన్ విచారణకు తనతోపాటు హరీశ్‌రావు హాజరై వివరణ ఇచ్చిన విషయాన్ని కేసీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారని... అదే రీతిలో అసెంబ్లీ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేసిన విమర్శలు, ఆరోపణలను తిప్పికొట్టాలని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల అనంతరం ప్రభుత్వం వ్యవహరించే తీరునుబట్టి అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీతో కుమ్మక్కై కక్షపూరిత చర్యలకు పాల్పడితే అనుసరించాల్సిన వ్యూహంపైనా కేసీఆర్ ఈ భేటీలో చర్చించినట్లు తెలియవచ్చింది.

**నేడు కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో ఎంచుకున్న అంశాలను మాత్రమే కేబినెట్‌లో ప్రభుత్వం చర్చించినట్లు బీఆర్ఎస్ అభిప్రాయపడుతోంది. సోమవారం కేబినెట్‌లో చర్చించిన కమిషన్ సంక్షిప్త నోట్‌లోని అంశాలను పార్టీ నేతలకు వివరించి ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ ముఖ్య నేతలకు కమిషన్ నివేదికలోని డొల్లతనాన్ని, రేవంత్ సర్కారు కుట్రలను ప్రజలకు విడమర్చి చెప్పాలని హరీశ్‌రావును కేసీఆర్ ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో కమిషన్ నివేదికపై ప్రభుత్వ కార్యదర్శుల త్రిసభ్య కమిటీ ఇచ్చిన సంక్షిప్త నివేదికలో పేర్కొన్న వివరాల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ ప్రజెంటేషన్‌ను రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ముఖ్య నేతలు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని కేడర్‌ను కేటీఆర్ ఆదేశించారు. ప్రజెంటేషన్ అనంతరం ముఖ్య నేతలు ఎక్కడికక్కడ జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్‌లు పెట్టి ప్రభుత్వ తీరును ఖండించాలని నిర్దేశించారు.

**నేడు ఢిల్లీకి కేటీఆర్**

కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధి బృందం మంగళవారం ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో జరిగే సమావేశానికి హాజరు కానుంది. ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళితోపాటు వివిధ పార్టీలు సమర్పించిన పెండింగ్ ప్రతిపాదనలపై చర్చలు జరగనున్నాయి.

## భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న టెస్లా

ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా, భారత మార్కెట్‌లో తన కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తోంది. ముంబైలో తన మొదటి షోరూమ్‌ను ప్రారంభించిన నెల రోజుల్లోపే, ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీలో రెండో షోరూంను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఈ కొత్త 'టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఆగస్టు 11న ఢిల్లీలోని ఏరోసిటీలో ఉన్న ఖరీదైన వరల్డ్‌మార్క్ 3 కాంప్లెక్స్‌లో ప్రారంభం కానుంది. ఈ షోరూం ఏర్పాటు పనులు దాదాపు పూర్తికావచ్చాయి. దీనికి సంబంధించిన చిత్రాలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. జాతీయ రాజధాని ప్రాంతంలోని వినియోగదారులను ఆకర్షించే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ షోరూం కోసం నెలకు సుమారు రూ. 25 లక్షల అద్దె చెల్లించనున్నట్లు సమాచారం. గత నెల జూలై 15న టెస్లా తన తొలి భారతీయ షోరూంను ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హాజరై, తమ రాష్ట్రంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కేంద్రంతో పాటు తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేయాలని టెస్లాను ఆహ్వానించారు. ప్రస్తుతానికి టెస్లా భారత్‌లో 'మోడల్ వై' అనే ఒక్క మోడల్‌ను మాత్రమే విక్రయిస్తోంది. దీని ఎక్స్-షోరూమ్ ధర రూ. 59.89 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఈ కారు రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. స్టాండర్డ్ రియర్-వీల్ డ్రైవ్ వేరియంట్ 60 %ఎౌష్ట్ర% బ్యాటరీతో ఒక్కసారి ఛార్జ్ చేస్తే 500 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. ఇక లాంగ్-రేంజ్ వేరియంట్ 75 %ఎౌష్ట్ర% బ్యాటరీతో 622 కిలోమీటర్ల రేంజ్‌ను అందిస్తుంది. తొలి దశలో ముంబై, పుణె, ఢిల్లీ, గురుగ్రామ్ నగరాల్లోని కొనుగోలుదారులకు డెలివరీలలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఫ్లాట్-బెడ్ ట్రక్కుల ద్వారా నేరుగా కస్టమర్ల ఇంటికే వాహనాలను డెలివరీ చేయనున్నారు. వినియోగదారుల సౌలభ్యం కోసం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వాహన రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా టెస్లా తన అధికారిక వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేసింది. అదనంగా రూ. 6 లక్షలు చెల్లిస్తే లభించే 'ఫుల్ సెల్ఫ్-డ్రైవింగ్' ఫీచర్‌ను భవిష్యత్తులో భారత్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది.

## అంతర్జాతీయంగా విస్తరిస్తున్న అదానీ..




అదానీ గ్రూప్ అంతర్జాతీయంగా తన కార్యకలాపాలను విస్తరించే వ్యూహంలో భాగంగా కీలక ముందడుగు వేసింది. ఆగ్నేయాసియా దేశమైన వియత్నాంలో ఏకంగా 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 83,000 కోట్లు) భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ప్రకటించింది. ఇది అదానీ గ్రూప్ విదేశాల్లో పెడుతున్న అతిపెద్ద పెట్టుబడులలో ఒకటిగా నిలవనుంది. ఇటీవల వియత్నాం రాజధాని హనోయిలో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆ దేశ కమ్యూనిస్ట్ పార్టీ జనరల్ సెక్రటరీ టో లామ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీ సందర్భంగా అదానీ గ్రూప్ పెట్టుబడుల ప్రణాళికను వెల్లడించారు. వియత్నాం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, తమ పెట్టుబడులకు అక్కడ అనుకూల వాతావరణం ఉందని గౌతమ్ అదానీ పేర్కొన్నారు. వ్యూహాత్మక మౌలిక సదుపాయాలు, ఇంధనం (ముఖ్యంగా పునరుత్పాదక ఇంధనం), లాజిస్టిక్స్, రవాణా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అధునాతన సాంకేతిక రంగాలలో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా, డా నాంగ్ నగరంలోని లీన్ చియు పోర్ట్ ప్రాజెక్టుపై అదానీ గ్రూప్ ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఈ పోర్ట్ నిర్మాణం కోసం ప్రాథమికంగా 2 బిలియన్ డాలర్ల పెట్టుబడికి వియత్నాం ప్రభుత్వం నుంచి సూత్రప్రాయ ఆమోదం కూడా లభించినట్టు సమాచారం. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, ఇది అదానీ గ్రూప్ నిర్వహిస్తున్న నాలుగో అంతర్జాతీయ పోర్ట్ అవుతుంది. ఇప్పటికే అదానీ పోర్ట్స్ ద్వారా వియత్నాంలో కార్యకలాపాలు నిర్వహిస్తుండటం ఈ విస్తరణకు మరింత కలిసి రానుంది. వియత్నాం సాధిస్తున్న ఆర్థిక ప్రగతి, డిజిటల్ ఆవిష్కరణలపై గౌతమ్ అదానీ ప్రశంసలు కురిపించారు. తమ దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే అంతర్జాతీయ కంపెనీలను స్వాగతిస్తామని, వారికి పూర్తి సహకారం అందిస్తామని వియత్నాం నాయకత్వం స్పష్టం చేసింది. ఈ భారీ పెట్టుబడి నిర్ణయం అదానీ గ్రూప్ గ్లోబల్ విస్తరణ వ్యూహంలో ఒక మైలురాయిగా, ఆగ్నేయాసియా ఆర్థిక ముఖచిత్రంలో భారత కంపెనీలకు పెరుగుతున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

# తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే

**న్యూఢిల్లీ:** 150 ఏళ్లకు పైగా చరిత్ర కల్గిన పురాతన బాంకే బిహారీ ఆలయానికి సంబంధించి ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం-ఆలయ ట్రస్టుల మధ్య నెలకొన్న వివాదాన్ని ఉన్నత స్థాయి కమిటి మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. బృందావన్‌లో ఉన్న బాంకే బిహారీ కృష్ణ దేవాలయం అంశానికి సంబంధించి సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ప్రధానంగా రూ. 500 కోట్లను ఆలయ నిధులతో దేవాలయ అభివృద్ధి పనులను చేపట్టడానికి యూపీ ప్రభుత్వం సిద్ధం కాగా, ఆలయ ట్రస్టు అభ్యంతరం వ్యక్తం చేయడంపై ఇది సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ఆలయ నిధులను అభివృద్ధికి వాడటానికి మే 15వ తేదీన సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వగా, తాజా తీర్పులో ఆ వివాదాన్ని ఓ కమిటీ ఏర్పాటు చేసి దాని ద్వారా సెటిల్ చేసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. అదే సమయంలో గత తీర్పును ఉపసంహరించుకోవాలని ధర్మాసనం మౌఖికంగా ప్రతిపాదించింది ప్రస్తుత ధర్మాసనం.

**తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే..**

బాంకే బిహారీ ఆలయం-యూపీ ప్రభుత్వం వివాదంపై జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన సుప్రీంకోర్టు ఇలా వ్యాఖ్యానించింది. ' బృందావన్‌లోని బాంకే బిహారీ టెంపుల్‌కు తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే. ఈ వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా సెటిల్ చేసుకోండి. సమస్య పరిష్కారం కోసం ఓ కమిటీని ప్రతిపాదిస్తున్నాం. ఆ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆలయ ట్రస్టు బోర్డుకు మధ్యవర్తిత్వం వహిస్తుంది. గత సుప్రీంకోర్టు తీర్పులో కొంత భాగాన్ని నిలుపుదల చేద్దాం. హైకోర్టు మాజీ న్యాయమూర్తి లేక సీనియర్ రిటైర్డ్ జిల్లా జడ్జి ఇరు పక్షాలకు ధర్మకర్తగా ఉంటారు' అని స్పష్టం చేసింది.

**ఇదీ ఆలయ చరిత్ర..**

1862లో నిర్మించబడిన ఈ ఆలయం రాజస్తానీ శైలిలో నిర్మించబడింది

ఉత్తరప్రదేశ్‌లోని బాంకే బిహారీ ఆలయం బృందావన్‌లో ఉన్న శ్రీకృష్ణ భక్తులకు అత్యంత పవిత్రమైన స్థలాలలో ఒకటి.

ఆధ్యాత్మికతతో నిండిన ప్రదేశం.



ఇక్కడ శ్రీ బాంకే బిహారీగా పూజించబడే కృష్ణుడు, బాలరూపంలో దర్శనమిస్తాడు.

ప్రత్యేకత: ఈ ఆలయంలో గంటలు మోగించరు, హారతులు ఇవ్వరు

ఇది భక్తి శ్రద్ధలకు అడ్డురాకుండా ఉండేందుకు అనాదిగా వస్తున్న ఆచారం.

ఏడాదిలో ఒక్కసారి మాత్రమే, అక్షయ తృతీయ రోజున మాత్రమే భక్తులు దేవుని పాదాలను దర్శించగలుగుతారు.

వివాదం ఇలా.. ఆలయ అభివృద్ధికి సంబంధించి యూపీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడం ఆలయ ట్రస్ట్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తద్వారా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గత మే నెలలో సుప్రీంకోర్టు తీర్పును వెలువరిస్తూ.. రూ. 500 కోట్లను కారిడార్ ప్రాజెక్ట్ కింద ఆలయ అభివృద్ధి కోసం వాడుకోవచ్చని స్పష్టం చేసింది.

యూపీ ప్రభుత్వంతో బాంకే బిహారీ టెంపుల్ ట్రస్టు మధ్య వివాదం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదానికి కారణం రూ. 500 కోట్ల కారిడార్ ప్రాజెక్ట్. ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ ప్రణాళికను తీసుకురాగా, ఆలయ ట్రస్ట్ దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. గత తీర్పును మౌఖికంగా నిలుపుదల చేస్తూ దీనిపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదించింది. దీన్ని హైకోర్టు లేదా, జిల్లా కోర్టు మాజీ జడ్జిల ద్వారా ఓ కమిటీ ఏర్పాటు చేసి మధ్యవర్తిత్వంతో వివాదాన్ని పరిష్కరించడమే సరైన మార్గంగా పేర్కొంది.

**ఆలయ వారసత్వం దెబ్బతింటుందనే..**

యూపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆలయ అభివృద్ధి-నిధులు ఆర్డినెన్స్‌పై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఒకవైపు ఆలయ ట్రస్ట్ అభ్యంతరంతో పాటు స్థానిక ప్రజలు కూడా వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి పేరుతో మరమ్మత్తులు చేపడితే ఆలయ వారసత్వం, వాస్తవికత దెబ్బతింటుందని అభిప్రాయం వ్యక్తమైంది. ఇది సున్నితమైన అంశం కావడంతో పాటు ఆధ్యాత్మిక వైభవం, సంప్రదాయాల సమతుల్యతలపై అనేక ప్రశ్నలు లేవనెత్తింది.

# రాహుల్ గాంధీ భారత వ్యతిరేక మనస్తత్వం బయటపడింది

## 'సుప్రీం' మదలింపుపై బీజేపీ నేతల వ్యాఖ్యలు..

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేతను సర్వోన్నత న్యాయస్థానం మందలించింది. నిజమైన భారతదేశ పౌరుడు అయితే ఇలాంటి వ్యాఖ్య చేసి వుండేవారు కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సోషల్ మీడియాకు బదులుగా పార్లమెంట్‌లో ఆయా అంశాలను ఎందుకు మాట్లాడలేదని నిలదీసింది. అయితే, సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిరాధాఅమైన వాదనలు చేసినందుకు సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించిందన్నారు. వేల చదరపు కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా సైన్యం ఆక్రమించిందని రాహుల్ చేసిన ప్రకటన దేశానికి హానికరమని.. మన సాయుధ దళాల నైతికతను తగ్గిస్తుందన్నారు. ఇలాంటి నిరాధారమైన ప్రకటనలు చేయొద్దని రాహుల్‌కు విజ్ఞప్తి చేస్తున్నామని.. అయినా తమ మాట వినడం లేదన్నారు. కనీసం సుప్రీంకోర్టు హెచ్చరించినందుకు సంతోషంగా ఉన్నానన్నారు. భారతీయుడిగా రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేకూడదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు చేసిందన్నారు. రాహుల్ గాంధీ భారత వ్యతిరేక మనస్తత్వాన్ని బయటపెట్టుకున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మండిపడ్డారు. సైన్యం ధైర్య సాహసాలు ప్రదర్శించి చైనా సైన్యాన్ని వెనక్కి పంపిస్తే.. చైనా సైన్యం అరుణాచల్ ప్రదేశ్‌లో 2వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిందని చెప్పడం సరికాదన్నారు. నిజమైన భారతీయులైతే ఇలాంటి వ్యాఖ్యలు చేసేవారు కాదని



కోర్టు అనడం రాహుల్ గాంధీ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయనన్నారు. కాంగ్రెస్ నాయకుడిగా ఎంత పరిణితి చెందిన వారని ఆయన ప్రశ్నించారు. చైనా సైన్యం ఆక్రమించిన రాహుల్ గాంధీ భారత వ్యతిరేక మనస్తత్వాన్ని బయటపెట్టడం ఇదే తొలిసారి కాదని విమర్శించారు. 2020 గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణను ఉద్దేశించి రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో చైనా 2వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిందని, ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని సరెండర్ చేశారని ఆరోపించారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై 2022 డిసెంబర్‌లో ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఆయన బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్. సైన్యంపై రాహుల్ గాంధీ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అయితే, ఆరోపణలు రాజకీయంగా ప్రేరేపితమి రాహుల్ కొట్టిపడేశారు. ఆ తర్వాత 2023 జనవరిలో జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లోనూ, చైనా మన భూమిని ఆక్రమించిందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీకి లక్నో కోర్టు సమన్లు జారీ చేసింది. దాన్ని అలహాబాద్ హైకోర్టు సమర్థించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంను ఆశ్రయించారు. రాహుల్‌పై లాయర్ వివేక్ తివారీ కేసు దాఖలు చేశారు. రాహుల్ పిటిషన్‌పై దీనిపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీహ్‌ల బెంచ్ విచారణ జరిపింది.

విచారణ సందర్భంగా రాహుల్ గాంధీ వ్యాఖ్యలను సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. 2వేల చదరపు కిలోమీటర్ల భూమిని చైనా తీసుకుందని మీరు ఎలా తెలుసుకున్నారని ప్రశ్నించింది? మీరు నిజమైన భారతీయులైతే అలా మాట్లాడరు కదా? అని జస్టిస్ దత్తా ప్రశ్నించారు. మీరు అక్కడ ఉన్నారా? మీ దగ్గర ఏమైనా నమ్మదగిన ఆధారాలు ఉన్నాయా? అంటూ ప్రశ్నలు సంధించారు. రాహుల్ గాంధీ తరపున వాదించిన న్యాయవాది సింఘ్వీ వాదనలు వినిపించారు. ఆయన వ్యాఖ్యలను వక్రీకరించారని, సైన్యాన్ని అవమానించే ఉద్దేశం రాహుల్‌కు లేదని తెలిపారు. ఇరువర్గాల వాదనలు సుప్రీంకోర్టు, పరువు నష్టం కేసుపై స్టే ఇచ్చింది. అయితే, రాహుల్ గాంధీ లాంటి నేతలు జాగ్రత్తగా మాట్లాడాలని కోర్టు హెచ్చరించింది.

# రాష్ట్రపతితో గంటల వ్యవధిలో మోదీ, అమిత్ భేటీలు.. అందుకేనా?

**ఇంటర్నెట్‌డెస్క్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా గంటల వ్యవధిలో ఆదివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో వేర్వేరుగా రాష్ట్రపతి భవన్‌లో సమావేశమైన సంగతి తెలిసిందే ఈ వరుస భేటీలపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడకపోయినప్పటికీ.. పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ కోసమేనంటూ సోషల్‌మీడియాలో ప్రచారం ఊపందుకుంది. ఆర్టికల్ 370ని రద్దుచేసి ఆరేళ్లు పూర్తవుతున్న తరుణంలో జరిగిన భేటీలతో ఈ తరహా చర్చ మొదలైంది. బ్రిటన్, మాల్దీవుల పర్యటన తర్వాత రాష్ట్రపతి ని ప్రధాని మోదీ కలవడం ఇదే తొలిసారి. తర్వాత కొన్ని గంటలకు తర్వాత అమిత్ షా కూడా ముర్ముతో సమావేశమయ్యారు. హోంమంత్రి తర్వాత జమ్మూకశ్మీర్ నేతలను వచ్చి కలిశారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే 370 ఆర్టికల్‌ను కేంద్రం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. సరిగ్గా ఆ తేదీకి రెండు రోజుల ముందే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. కచ్చితమైన గడువు నిర్దేశించనప్పటికీ.. రాష్ట్రహోదా పునరుద్ధరణకు పలుమార్లు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఇద్దరూ హామీ ఇచ్చారు. ఇక, బిహార్ ఓటర్ల జాబితాపై జరుగుతున్న



ప్రత్యేక సమగ్ర సవరణ ప్రత్యేక చర్చ కోసం పార్లమెంటులో విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అటు ప్రధాని.. ఇటు హోంమంత్రి రాష్ట్రపతిని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే.. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు రాజ్యాంగబద్ధమేనని 2023లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. "అప్పట్లో పరిస్థితుల దృష్ట్యా ఆర్టికల్ 370ని ప్రవేశపెట్టారు. అది తాత్కాలిక ఏర్పాటు మాత్రమే గానీ.. శాశ్వతం కాదు. దాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది" అని స్పష్టం చేసింది. కాగా.. జమ్మూకశ్మీర్ కు గతేడాది జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ)-కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్‌కు తొలి సీఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం ఆయన డిమాండ్ చేస్తూనే ఉన్నారు. "2014లో మీరు ఇక్కడికి వచ్చినప్పుడు నేను రాష్ట్రానికి సీఎంగా ఉన్నాను. నేను ఇప్పుడు ఒక కేంద్రపాలిత ప్రాంత సీఎంగా డిమోట్ అయ్యాను. అప్పుడు రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్న వ్యక్తికి.. లెఫ్టినెంట్ గవర్నర్‌గా ప్రమోషన్ వచ్చింది. త్వరలో నాకు ప్రమోషన్ వస్తుందని ఆశిస్తున్నా. దీన్ని సరిదిద్దడానికి ఎక్కువ సమయం పట్టదనుకుంటున్నాను" అని మోదీని ఒమర్ నేరుగా ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

## తక్షణమే ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకొని దర్యాప్తు చేయించాలి.

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక



కాంగ్రెస్ ఎంపీటీసీ అభ్యర్థి గీత పై భౌతిక దాడులు చేసిన టీడీపీ గుండాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. మండపేట లో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గం కుప్పంలో ఎంపిటిసి సభ్యుల ఉపఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ని తీసుకొని కార్ లో ప్రయాణిస్తున్న చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ పై టీడీపీ గుండాలు దాడి చేయడం దుర్మార్గం అని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యం లో పోటీలు సహజమన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఇటువంటి సంఘటనలు జరగడం రాష్ట్ర పరిస్థితి లు ఏవిధంగా ఉన్నాయో ప్రజా స్వామ్య వాదులు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు.తక్షణం ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకొని దర్యాప్తు చేసి దాడులు చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి పై క్రిమినల్ కేసులను నమోదు చేసి అరెస్టు చేయాలని కామన డిమాండ్ చేశారు.దాడులు చేసిన వారి పై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు.

## అంగరంగ వైభవంగా ఎస్. జి. టాక్స్ తెలుగు మీడియా యూట్యూబ్ ఛానల్ ప్రారంభోత్సం

**రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన మాజీ మంత్రి మాడుగుల ఎమ్మెల్యే బండారు**





సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక అనకాపల్లి జిల్లా, పరవాడ :

జగనన్న కాలనీలో ఎస్.జి. టాక్స్ తెలుగు మీడియా యూట్యూబ్ ఛానల్ ప్రారంభోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. మాజీ మంత్రి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కత్తిరించి యూట్యూబ్ ఛానల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు బండారును వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. యూట్యూబ్ ఛానల్ వ్యవస్థాపకులు సీఈవో చైర్మన్ పైల శ్రీను, మేనేజింగ్ డైరెక్టర్ బండారు సోమనాయుడు బండారుకు పుష్పగుచ్ఛం అందజేసి, సాలువ కప్పి సత్కరించారు. అనంతరం ఇంటర్వ్యూ క్యాబిన్లో బండారుతో ఛానల్ సీఈఓ శ్రీను కొంతసేపు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ పరవాడ ప్రాంతంలో స్థానికంగా యూట్యూబ్ ఛానల్ స్టూడియోను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో యూట్యూబ్ ఛానల్ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజా ధారణ పొందాలని, సరికొత్త ఆలోచనలతో ఎపిసోడ్లు ప్రసారం చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధి గా ఉంటూ మంచి విషయాలు ప్రజలకు తెలియజేయాలని కోరారు. నూతనంగా ఛానల్ ప్రారంభించిన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండారుతో పాటు పరవాడ మండలం జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల రమేష్ బాబు సోదరుడు పంచకర్ల ప్రసాదు, జడ్పిటిసి పైల సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, రామ్ కి ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, మాజీ మండల అధ్యక్షులు పైల జగన్నాథరావు, తానం టిడిపి సీనియర్ నాయకులు కన్నూరు వెంకటరమణ, మాజీ ఆర్ఇసిఎస్ చైర్మన్ చల్లా కనకారావు, ఉమ్మడి రూరల్ విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగుడి రామ గోవిందరావు రావు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, బిజెపి నాయకులు కుంద్రపు సోము నాయుడు, వెన్నెల పాలెం పి బోనంగి వెన్నెల నరసింహారావు, రాము, టీడీపి గ్రామ అధ్యక్షులు భోజంకి నాయుడు, గొంప మారునాయుడు, అభి, వైసిపి నాయకులు భూపతి సన్యాసిరావు, పైల నవత అప్పలనాయుడు తదితరులు పాల్గున్నారు.

## తీవ్ర చిక్కుల్లో అనిల్ అంబానీ

రిలయన్స్ గ్రూప్ అధినేత అనిల్ అంబానీని కష్టాలు వెంటాడుతున్నాయి. మనీలాండరింగ్ కేసులో ఆయనపై దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. తాజాగా ఈ కేసులో పలు బ్యాంకులకు నోటీసులు జారీ చేసింది. లోన్ ఫ్రాడ్ కేసుకు సంబధించి పలు వివరాలు కోరింది. వీటిల్లో ఆయన కంపెనీలకు చెందిన రుణ మంజూరు పత్రాలు వంటివి ఉన్నాయి. మొత్తం 12-13 బ్యాంకులకు దర్యాప్తు సంస్థ నుంచి నోటీసులు వెళ్లినట్లు తెలుస్తోంది. వీటిలో వీటిల్లో పబ్లిక్ సెక్టార్‌తోపాటు ప్రైవేటు సెక్టార్ బ్యాంకులు ఉన్నాయి. ఇవి రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ వంటి సంస్థలకు భారీగా అప్పులు ఇచ్చాయి. తాజాగా ఈడీ నోటీసులు అందుకొన్న జాబితాలో ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యూకో బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సింద్ బ్యాంక్ ఉన్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. అనిల్ అంబానీ కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బకాయిలుగా మారిన కేసుల్లో కొందరు బ్యాంక్ అధికారులను కూడా ఈడీ ప్రశ్నించే అవకాశం ఉంది. వీరిని లోన్ క్లియరెన్స్‌లకు సంబంధించి

# బీసీల రిజర్వేషన్లు అడ్డుకుంటున్న బిజెపి

**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి**

**సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య**




అసెంబ్లీలో ఆమోదం చేసి పార్లమెంటు పంపించిన బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్సును బిజెపి అడ్డుకుంటుందని సిపిఐఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, పార్లమెంట్లో ఆర్డినెన్స్ ఆమోదించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ గజ్వేల్ మండలం కమిటీ సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పార్టీలు బలపరిచి అసెంబ్లీలో బిల్లును ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తయారు చేసి గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటుకు పంపిస్తే కేంద్రంలో బిజెపి అడ్డుకుంటుందని అన్నారు. దేశవ్యాప్తంగా కులగనన సర్వే చేయాలని డిమాండ్ చేశారు. మైనార్టీలలో దూదేకుల పకీరు, కాషా అనేక రకాల వెనుకబడిన వారు ఉన్నారని అన్నారు. బీసీ కులాల్లో వివిధ మతాల స్వీకరించిన వారు ఉన్నారని కారణంతో వారికి రిజర్వేషన్లు ఉండకూడదని ఉద్దేశంతో రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. రాజస్థాన్ ఉత్తర ప్రదేశ్ మధ్యప్రదేశ్ తదితర బిజెపి పాలిత రాష్ట్రాల్లో మాత్రం అమలు చేస్తూ తెలంగాణలో మాత్రం వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి యజమానులకు అనుకూలంగా కార్మిక కోడలు తెచ్చిందని, కనీస వేతనాలు పెంచడం లేదని, నిత్యవసర సరుకుల ధరలు పెంచిందని, పెట్రోల్ డీజిల్ ధరపై పన్నులతో పాటు అదనంగా సెస్ విధిస్తూ ప్రజలపై భారం మోపుతు ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితిలు కల్పిస్తూ సామాన్యులను రోడ్డున పడేస్తుందని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అన్ని జుమ్లా అని తెలిపిందని అన్నారు అమెరికాతో దోస్తీ చేస్తూ దేశంపై 25% పన్నుల విధింపు కారణమవుతుందని అన్నారు. దీంతో దేశంలో తయారైన సరుకులు అమ్ముడుపోక ఆర్థిక వ్యవస్థ కుదేలు అవకాశం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని పెండింగ్లో ఉన్న రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు బండ్ల స్వామి, రాణి, వెంకట చారి రాజు,ఐలయ్య,లక్ష్మి, స్వామి, తదితరులు పాల్గొన్నారు


# కాంగ్రెస్ పార్టీలో చిచ్చు పెట్టడమే వారి లక్ష్యం

**ప్రతాప్ రెడ్డి డైరెక్షన్లో పనిచేస్తున్న నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డి**

**అన్నం పెట్టిన వారికి సున్నం పెట్టడం నాయిని యాదగిరి నైజం**

**పదవులు కట్టబెట్టిన ప్రతాప్ రెడ్డి రుణం తీర్చుకుంటున్న నాయిని యాదగిరి**

**పిల్లికి కూడా బిచ్చం పెట్టని మల్లారెడ్డి పార్టీకి ఖర్చు పెట్టానని అనడం సిగ్గుచేటు**



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను రచ్చ చేసేందుకు ప్రతాపరెడ్డి కుట్ర పన్నగా, అందులో నాయిని యాదగిరి, మల్లారెడ్డి పావులుగా మారినట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ నేత సమీర్, మాజీ కౌన్సిలర్ నక్క రేగొండ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు మొనగారి రాజు, రాములు గౌడ్ మాజీ ఎంపీటీసీ అంజి యాదవ్ విమర్శించారు. సోమవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో తమకు ఎలాగూ స్థానం లేదని గ్రహించిన వారు ప్రభుత్వానికి మంచి పేరు రాకుండా, మంత్రి వివేక్ వెంకటస్వామి సభను రచ్చ చేసేందుకు ముందే ప్లాన్ సిద్ధం చేసుకున్నట్లు సమాచారం ఉందని అన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూ%శీ%కుంట నర్సారెడ్డి నేతృత్వంలో పంపిణీ ప్రక్రియను పండగ వాతావరణంలో జరిపేందుకు నిర్ణయం తీసుకోగా, ఆయన నేతృత్వంలో మంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చినట్లు గుర్తు చేశారు. వర్గల్, ములుగు, మర్కుక్, జగదేవపూర్ మండలాల పరిధిలో ప్రశాంతంగా జరగగా, గజ్వేల్ లో మాత్రం రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభించడానికి మంత్రి సిద్ధమవుతున్న తరుణంలో నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డితో పాటు మరో ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసినట్లు ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలు సంతోషంగా ఉన్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా కోవర్టు రాజకీయాలు చేస్తూ వారు కుట్ర పన్నినట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆహ్వానం లేకుండానే వారు పోలీసుల కన్నుగప్పి సభ ప్రాంగణంలోకి చొచ్చుకొని వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో వారు పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు ఇస్తూ మంత్రిని తప్పుదోవ పట్టించే విధంగా వాగ్వాదానికి దిగినట్లు చెప్పారు. మంత్రి వివేక్ వెంకటస్వామికి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నేతృత్వంలో భారీ కాన్వాయ్ మధ్య ఘన స్వాగతం పలకగా, వారు జీర్ణించుకోలేకపోయినట్లు చెప్పారు. మొదటి నుండి అన్నం పెట్టిన వారికి సున్నం పెట్టడం నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డి నైజం కాగా, పిల్లికి బిచ్చం వెయ్యని వారు పార్టీ కోసం ఖర్చు పెట్టానని అనడం సిగ్గుచేటని నిలదీశారు. గజ్వేల్ నియోజకవర్గంలో మండలానికి ఇద్దరు ముగ్గురిని పోగుచేసుకొని గొడవలు చేయడం లక్ష్యంగా పెట్టుకోగా, పద్ధతి మార్చుకోకుంటే తగిన శాస్తి చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీని విచ్చిన్నం చేయడమే వారి లక్ష్యం కాగా, గతంలో పదవులు కట్టబెట్టిన ప్రతాప్ రెడ్డి రుణాన్ని ఈ విధంగా నాయిని యాదగిరి తీర్చుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తమ లబ్దికోసం కలసి మెలసి ఉంటున్న మైనంపల్లి హన్మంతరావు, తూ%శీ%కుంట నర్సారెడ్డి మధ్య నాయిని యాదగిరి చిచ్చుపెట్టి కాంగ్రెస్ పార్టీకి శకునిలా వ్యవహరిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం వారికి వెన్నతో పెట్టిన విద్య కాగా, నర్సారెడ్డి ద్వారా పదవులు పొందిన యాదగిరి, మల్లారెడ్డిలు ఆయన పైనే విమర్శలు చేయడం సహించమని అన్నారు. కాగా వారి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని, ఇప్పటికే తగిన ఆధారాలు సేకరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గాడేపల్లి శీను చెప్యాల శేఖర్ కన్నా యాదవ్ డప్పు గణేష్ బాలు అరుణ్ సుంకం సురేష్ పాల్గొన్నారు

# జమ్మికుంట పట్టణంలో ఘనంగా కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ జన్మదిన వేడుకలు

**సామాన్యుడి అస్త్రం ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ :**



కరీంనగర్ జిల్లా డిసిసి బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ జన్మదిన వేడుకలు జమ్మికుంట పట్టణం తోపాటు ఇల్లంతకుంట మండల కేంద్రంలో యూత్ నాయకులు అట్టహాసంగా నిర్వహించారు. పట్టణంలోని శివాలయం లో అన్నదానం నిర్వహించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు అనంతరం గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు జెకె జానీ అఖిల్ గౌడ్ కొమ్ము నరేష్ మాట్లాడుతూ, మండలంలోని విలాసాగర్ గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించిన రమేష్ తన రాజకీయ ప్రస్తానాన్ని అప్పటి మాజీ మంత్రి టిడిపి నేత ముద్దసాని దామోదర్ రెడ్డి హయాంలో రాజకీయాల్లోకి వచ్చాడని తెలిపారు. అప్పటినుండి తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టిన రమేష్ అతి చిన్న వయసులోనే విలాసాగర్ గ్రామ సర్పంచ్ గా గెలిచి తన సేవలను అందించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరి జమ్మికుంట మండల అధ్యక్షుడిగా పనిచేస్తూనే జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నియమితులై రైతులకు కార్మికులకు తన సేవలను అందించి మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ గా తన సేవలను అందిస్తూ వస్తున్నారని రాబోయే రోజుల్లో రమేష్ మరిన్ని ఉన్నతమైన పదవులు పొంది ముందుకు సాగాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. నిస్వార్థ సేవకుడిగా పేరుపొందిన రమేష్ అన్ని తరాల వారితో అన్ని వర్గాల వారితో సత్సంబంధాలు కలిగి ఉన్నాడని అన్నా అని పిలిస్తే పలికే మనస్తత్వం రమేష్ కు ఉన్నదని వారు అన్నారు. భవిష్యత్తులో పింగిలి రమేష్ కు అండగా నిలబడి వారి రాజకీయ ప్రయాణంలో అండగా నిలుస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. జవ్వాజి అనిల్ వజపల్లి రాజు అర్జున్ ఎం రవీందర్రావు తో పాటు సుమారు వందమంది కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## పత్రికా కథనానికి స్పందన




**రాజనగరం మండలం. సామాన్య అస్త్రం**

మండలంలో జిఎస్ఎల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న హ్యాపీ వైన్ షాప్ అక్రమ మద్యం అమ్మకాల పైన పత్రికలలో రావడం పైన డిస్టిక్ కమిషనర్ స్పందించి వైన్ షాప్ లో తనిఖీలు నిర్వహించడం జరిగింది. రిజిస్టర్ సరిగా లేదని అనుమతులు లేకపోయినా పక్కనే సిట్టింగ్ ఏర్పాటు చేయడం వలన టెక్నికల్ కేసు నమోదు చేయడం జరిగిందని సుమారు ఈ కేసుకి సంబంధించి లక్ష రూపాయల వరకు ఫైన్ కట్టవలసి ఉంటుందని రాజమహేంద్రవరం ఎక్సైజ్ సీఐ తెలియజేశారు.

## శ్రావణ సోమవారం సందర్బంగా మహాశివునికి అభిషేకాలు

**ఘనంగా నిర్వహించిన రామకోటి రామరాజు దంపతులు**

**శ్రావణమాసం అంతా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రామకోటి సంస్థ**



శ్రావణమాసం సోమవారం సందర్భంగా గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో అద్దాల మందిరం వద్ద మహాశివునికి పంచామృత అభిషేకాలు సంస్థ అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు దంపతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రావణమాసం భక్తికి చాలా శ్రేష్టమైన మాసం అన్నారు. మనిషిగా పుట్టడం చాలా గొప్ప విషయం అన్నారు. మళ్ళీ మళ్ళీ మానవ జన్మ దొరుకుతుందని కూడా ఎవ్వరము చెప్పలేమన్నారు. పుట్టడము ఎలాగో మన చేతిలో లేదు మరి చావడం మన చేతిలో ఉందా అంటే అది కూడా లేదన్నారు. ఏ సమయం ఎలా వస్తుందో కూడా తెలియదన్నారు. అందుకే భగవన్నామాన్ని స్మరించాలని పిలుపునిచ్చారు.

## మణుగూరు వంద పడకల హాస్పిటల్లో రక్త దానం చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

**మణుగూరు, ఆగష్టు 04 సామాన్యుడి అస్త్రం:**



మణుగూరు మండలం వంద పడకల హాస్పిటల్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రక్త దానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజన నేతలు మరియు గిరిజనులు ఎక్కడో మారుమూల ప్రాంతంలో జీవిస్తున్న ప్రజలకు గర్భిణి స్త్రీలు వారి ప్రసవ సమయంలో పడుతున్న ఇబ్బందులకు అనుకోకుండా ప్రమాదవశాతం మరణిస్తున్న ప్రజలకు ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్న వారికి ఎక్కడి నుంచో వేల రూపాయలు ఖర్చుపెట్టి రక్తం తెప్పించేలోపు వారి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని. అందుకే మణుగూరులో రక్త నిల్వ చేసే కేంద్రాన్ని ప్రారంభించామని ప్రజలకు నిత్యం ఉచితంగా రక్తం అవసరం ఉన్నవారికి మణుగూరు ప్రధాన వైద్య అధికారిని సంప్రదిస్తే వారికి కావలసిన రక్తం అందుబాటులో ఉంటుందని, కావున ప్రజలు ప్రభుత్వ హాస్పటల్లో మెరుగైన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, వైద్యం అందించే డాక్టర్లు అందుబాటులో ఉన్నారని కలెక్టర్ అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో డిఎంహెచ్ఓ రవిబాబు, ప్రధాన వైద్య అధికారి సునీల్, ఆర్ఎం. ఎండిఓ శ్రీనివాసరావు ఎంపీడీవో వెంకటేశ్వర్లు,తాసిల్దార్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**- సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డాక్టర్ మధుకర్**

**సామాన్యుడి అస్త్రం ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం**



కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామంలో డాక్టర్ మధుకర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వైద్యులు మధుకర్ మాట్లాడు తూ.. శిబిరంలో భాగంగా డ్రైడే ఇంటింటిని సర్వే పైరిత్రం ఇండోర్ స్ప్రే చేయడం జరిగిందని, రక్త నమూనాలు సేకరించి సీజన్ వ్యాధుల స్క్రీనింగ్ లను నిర్వహించమని,ఈ సందర్భంగా నీటి నిల్వలను తొలగించి సీజన్ వ్యాధులకు కారణమయ్యే దోమల సంతతిని నివారించే చర్యలు చేపట్టామని డాక్టర్ మధుకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇప్పల్ నర్సింగాపూర్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ వైద్యులు స్నిగ్ధ, హెచ్ ఈ ఓ విజేందర్ రెడ్డి, ఏ ఎన్ ఎం పద్మ,కవిత, హెల్త్ అసిస్టెంట్ సత్యం, ఆశ కార్యకర్తలు మంజుల, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు మండలంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయండి

## ఆధార్ కేంద్రం లేక ఇబ్బందులు పడుతున్న స్థానికులు విద్యార్థులు

## ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని భద్రాచలం ఐటిడిఏ లో ఫిర్యాదు

## మణుగూరు అడ్వకేట్ సామాజిక కార్యకర్త కర్నె రవి

**మణుగూరు ఆగస్టు 04 సామాన్యుడి అస్త్రం:**

ఆధార్ నమోదు శిబిరాల ఏర్పాటు కోసం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారికి, మణుగూరు మండలంలోని గిరిజన పిల్లలకు ఆధార్ లేక విద్యావకాశాలు దూరం అవుతున్నాయని, తక్షణమే ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి చేశారు. మణుగూరు మండలంలోని పలువురు గిరిజన గ్రామాలలో జీవిస్తున్న పిల్లలకు ఆధార్ కార్డులే లేవన్న కారణంతో విద్యా వ్యవస్థ నుండి దూరంగా పడిపోతున్న పరిస్థితిని గమనించిన సామాజిక కార్యకర్త కర్నె రవి ఈరోజు భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మణుగూరు మండలంలోని బుగ్గ, ఖమ్మం తొగు, బుడుగు, రెగులగండి, పెద్దపల్లి, ఇప్పలగుంపు, వైఎస్ఆర్ నగర్ మరియు పరిసర గిరిజన గ్రామాలలో ఉన్న చిన్నారులకు పుట్టిన సర్టిఫికెట్లు లేకపోవడంతో ఆధార్ నమోదు జరగలేదు. దీనివల్ల వారు పాఠశాలల్లో చేర్పు కావడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్య, ప్రభుత్వ పథకాలు, గుర్తింపు అనేవి ఆధార్ లేకుండా వారికి అందడం లేదన్నారు. గిరిజన తల్లిదండ్రులలో



అక్షరాస్యత లేని స్థితి, దూర ప్రాంతాలలో ఆధార్ కేంద్రాల లభ్యత లేకపోవడం, ఆర్థిక పరిస్థితులు వీరిని మరింత వెనక్కి నెట్టుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు మరియు నవీకరణ శిబిరాలు ఏర్పాటు చేయాలని, పుట్టిన సర్టిఫికెట్ లేని చిన్నారులకు యుఐడిఏఐ నిబంధనల ప్రకారం ప్రత్యామ్నాయ ధృవీకరణ పద్ధతులను అనుమతిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని కర్నె రవి ప్రాజెక్ట్ అధికారిని అభ్యర్థించారు. ఈ శిబిరాల ద్వారా గిరిజన చిన్నారులకు విద్యావకాశాలు మళ్ళీ లభించడంతో పాటు, వారి జీవితంలో నూతన ఆశలు చిగురించనున్నాయని అన్నారు.

# బీసీ రిజర్వేషన్ల అమలు కోసం హలో బీసీ - చలో ఢిల్లీ

## ఇల్లంతకుంట సీతారామచంద్ర స్వామి దేవస్థాన చైర్మెన్ ఇంగిలే రామారావు

**సామాన్యుడి అస్త్రం ప్రతినిధి హుజురాబాద్**

హైదరాబాద్ నుండి ఢిల్లీ బీసీ గర్జనకు బయలుదేరిన కాంగ్రెస్ నేతలు ఈ నెల 6వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే బీసీ గర్జన కార్యక్రమానికి హుజురాబాద్ నియోజకవర్గం నుండి పలువురు నాయకులు ఆదివారం ఉదయం చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఢిల్లీకి బయలుదేరారు. నియోజకవర్గ ఇంచార్జి వోడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో ఢిల్లీ కి హుజురాబాద్ నియోజకవర్గం నుండి తరలి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు ఈ నెల 5,6,7 లలో బీసీ రిజర్వేషన్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా లో పాల్గొననున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ లకు 42% రిజర్వేషన్ కోసం అసెంబ్లీ తీర్మానం చేసి, గవర్నర్ కు పంపిన దాన్ని రాష్ట్రపతి ఆమోదించి తక్షణమే రిజర్వేషన్లు ఇవ్వాలని తరలి వెళ్లడం జరుగుతుంది. బీసీ రిజర్వేషన్ల పరిరక్షణ, హక్కుల కోసం కేంద్రాన్ని ని లదియాలని ఉద్దేశంతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు, హుజురాబాద్ మండల అధ్యక్షులు కిరణ్, మాజీ అధ్యక్షులు మహేందర్ గౌడ్ , మాజీ ఎంపీపీ శ్రీకాంత్,సీనియర్ నాయకులు పుదారి శివ కుమార్ గౌడ్ సాహెబ్ హుస్సేన్, అప్సర్,కమలాపూర్ మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్,సంపత్ తదితరులు ఢిల్లీ కి బయల్దేరారు .

# పదవి విరమణ మహోత్సవ కార్యక్రమం

**సామాన్యుడి అస్త్రం ప్రతినిధి కల్వకుర్తి నియోజకవర్గం (వెల్దండ ):**

వెల్దండ మండల పరిధిలో జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సోమవారం పదవి విరమణ తీసుకున్నారు పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేసి అదే విధంగా సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి తన గుర్తింపుగా పాఠశాలలో ఒక్క మొక్కను నాటారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని తను సూచించారు. సమస్త చరచర ప్రాణులలో మానవజన్మ దుర్లభామైనది. అందులో అజ్ఞాన సమస్యలను పటాపంచలు చేసి జ్ఞాన దీపికలను అందించినారు మన సనాతన గురుదేవులు. అట్టి దేశీకుతముల ప్రవాహ జనితులైన పూజ్యురాలు. ఒక పల్లెటూరులో అర్థం గురవయ్య ఎల్లమ్మ దంపతులకు ఆరవ సంతానం తమ విద్యాభ్యాసం ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల పల్లి నందు కళాశాల విద్య ఘట్కేసర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఉపాధ్యాయ శిక్షణ టిటిసి నేరేడుమెంట్ ప్రభుత్వ డైట్ కళాశాల నందు ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ నుండి బి.ఏ పద్మావతి యూనివర్సిటీ తిరుపతి నుండి బి.ఎడ్ పూర్తి చేసుకొనేంతవరకు అలుపెరగక సాగిన విద్యాభ్యాసం విలక్షణం. ఎంతో కష్టపడి చదివి ఉన్నత విద్యాభ్యాసం చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని తపనతో ఎంతగానో కష్టపడ్డారు. తమ ఉద్యోగ ప్రస్థానం 1985 సంవత్సరం డీఎస్సీ నందు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా



స్పెషల్ టీచర్ గా ఉద్యోగం సాధించిన అర్థం పద్మ అతి చిన్న వయసులోనే ఉద్యోగం సాధించానని ఎంతగానో సంతోషించారు తమ కుటుంబ సభ్యులు ఎంతగానో ఆనందించారు. తమ వివాహం ఒక ప్రభుత్వ ఉద్యోగి అయినా హరినాథ్ బాబును వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న వ్యక్తిని 1991న వివాహం జరిగింది విద్యార్థినీ విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి కృషి చేసినందుకుగాను పద్మకు 2024 సంవత్సరంలో జిల్లా విద్యాశాఖ వారిచే జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం లభించింది ఉపాధ్యాయురాలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే రక్తదాన శిబిరాల్లో ఆరోగ్య కార్యక్రమాల్లో పలు సామాజిక కార్యక్రమాల్లో తన వంతుగా పాల్గొని సేవలందించినందుకు గాను రెడ్ క్రాస్ సొసైటీ లైన్స్ క్లబ్ వాసవి వనిత క్లబ్ లాంటి ఎన్నో సామాజిక సంస్థలచే ప్రశంసలు సన్మానాలు అందుకున్నారు. బోధనను చేపట్టి విద్యార్థుల వెన్ను తట్టి పటాస్ పాఠశాలకు కన్నవారికి పుట్టిన ఊరికి మంచి పేరు తెచ్చి పెట్టిన ఆరుపదుల ఆదర్శమైన మనసున్న వారు మా పద్మ. సాధుగుణములు గల సత్య శీలియుతాను మధురమోహనంబు మాటలోన భార్యభర్తలిట్లు బాధ్యత కలిగి మెలగవలయు చెలిమితోడ ఉద్యోగ విరమణ తేదీ 31-జులై న అయిపోయింది. ఇట్టి తన పదవి విరమణ కార్యక్రమం వెల్దండ మండలంలో ఘనంగా తోటి ఉపాధ్యాయులు టీచర్స్ శాల్వాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండలంలోని ఉపాధ్యాయులు అందరూ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అప్పు చెల్లించలేదని ఆత్మహత్యాయత్నం

**సామాన్యుడి అస్త్రం ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ :**

తాను ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలని అడిగితే బెదిరింపులకు పాల్పడడంతో మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన హుజూరాబాద్ పట్టణంలో కలకలం రేపింది. స్థానికుల కథనం మేరకు హుజురాబాద్ పట్టణానికి చెందిన పంజాల కృష్ణ, వనం హరీష్ అనే హొటల్ వ్యాపారికి రూ.25 లక్షల అప్పు ఇచ్చారు. అయితే, ఒక సంవత్సరం గడిచినా హరీష్ ఆ అప్పును తిరిగి ఇవ్వలేదు. కృష్ణ తాను వేరే వాళ్ల దగ్గర అప్పు తెచ్చి హరీష్కు ఇచ్చానని, అప్పు ఇచ్చిన వారు తనను ఇబ్బందులు పెడుతున్నారని, అప్పు చెలించమని హరీష్ హొటల్ వద్దకు వెళ్లి కోరారు.?? దీనికి హరీష్ బెదిరింపులకు సమాచారం. ఈ సంఘటనతో తీవ్రమనస్తాపానికి గురైన పంజాల కృష్ణ, పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్కు వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. క్రిందపడి అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణను స్థానికులు గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువులకు సమాచారం అందించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బంధువులు జమ్మికుంటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కృష్ణ పరిస్థితి విషమంగా ఉందని ఆయన బంధువులు తెలిపారు. ఈ ఘటనపై కృష్ణ బంధువులు మాట్లాడుతూ అప్పు తీర్చకుండా కృష్ణ ఆత్మహత్యాయత్నానికి కారణమైన వనం హరీష్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి ముందు కృష్ణ సెల్ఫీ వీడియో కూడా తీసుకున్నారు.



# గానుగుపహాడ్ - చీటకోడూర్ వంతెనలను త్వరితగతిన నిర్మించాలి

**టీజేయు జనగామ జిల్లా అధ్యక్షుడు భూస రమేష్ యాదవ్**



**జనగామ,ఆగస్టు 04 సామాన్యుడి అస్త్రం దిన పత్రిక**

జనగామ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు గానుపహాడ్ చిటకోడూర్ వంతెన సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం రోజున ఎనిమిదవ రోజు సాధన సమితి అధ్యక్షులు యాసారపు కర్ణాకర్ ప్రధాన కార్యదర్శి ఏనుగు సిద్ధులు ఆధ్వర్యంలో ఎనిమిదవ రోజు రిలే నిరాహార దీక్షలు, కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా కమిటీ మద్దతు తెలుపుతూ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బూస రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. జనగామ నుండి హుస్నాబాద్ వెళ్లే రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుందని ప్రజలు ప్రతి అవసరానికి జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్తూ ఉంటారని కరీంనగర్ వెళ్లే ప్రజలు కూడా ఉప్పల్,ఘట్కేసర్ వాసులు దాదాపు ఈ మార్గం నుండే ప్రయాణాలు కొనసాగిస్తూ ఉంటారు. నిత్యం సరుకు రవాణా కూడా ఎక్కువ జరుగుతూ ఉంటుంది. ఇప్పటికే చాలా ప్రమాదాలు జరిగాయి వంతెన నిర్మాణం శంకుస్థాపన చేసి ఏండ్లు గడుస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు స్పందించడం లేదు దీనివలన ప్రజలు చాలా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని చిటకోడూరు వంతెన కూడా వెంటనే నిర్మాణం చేపట్టాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ (టి జే యు) డిమాండ్ చేస్తూ దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ స్టేట్ ఉమెన్స్ వింగ్స్ చైర్మన్, డాక్టర్ డి నవ్య, శ్రీ లలిత జనగామ హ్యూమన్ రైట్స్ చైర్మన్,బానోత్ అరుణ్ కుమార్ వైస్ చైర్మన్ రమావత్ తిరుపతి, ఆర్టిఐ చైర్మన్ బాల్ దే ఉమాపతి, కన్జ్యూమర్ చైర్మన్ బి రాజు, ఏ సతీష్, తెలంగాణ జర్నలిస్టు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం రమేష్ యాదవ్ ప్రధాన కార్యదర్శి మంచి కట్ల రాజేష్, కోశాధికారి నవీన్ చారి, సహాయ కార్యదర్శి అబ్రోజు, మరియు తదితరులు సంఘీభావం తెలిపారు.

# మైనారిటీ గురుకుల పాఠశాల (బాలికలు)లో వైద్య శిబిరం



**సామాన్యుడి అస్త్రం ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ :**



వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్మికుంట మున్సిపల్ పరిధిలో గల మైనార్టీ గురుకుల పాఠశాల (బాలికలు) లో డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ వైద్య శిబిరంలో 83 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి దగ్గు జలుబు చిన్న చిన్న సమస్యలు ఉన్న వారికి మందులు పంపిణీ చేయడం జరిగింది, జ్వరంతో బాధపడుతున్న నలుగురు విద్యార్థినిలకు రక్తపూతలు సేకరించి వ్యాధి నిర్ధారణకి ల్యాబ్ కు పంపించడం జరిగింది, ఈ సందర్భంగా వసతి గృహంలోని బాలికలకు డాక్టర్స్ సంధ్యారాణి,మరియు హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్య, మెదడువాపు, టైఫాయిడు, జాండిస్ మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం, వ్యాధుల లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను బయటి తిను బండారాల జోలికి వెళ్ళవద్దని కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని విద్యార్థులకు సూచించినారు. ఈ కార్యక్రమములో డాక్టర్ సంధ్యారాణి,హెల్త్ ఎడ్యుకేటరు మోహన్ రెడ్డి, మైనార్టీ గురుకుల పాఠశాల (బాలికలు) ప్రిన్సిపాల్ నదియా ఫర్నాజ్, స్టాఫ్ నర్స్ రాణి,ఏఎన్ఎం రమాదేవి,ఆశా కార్యకర్త సరిత,శైలజ మరియు ఉపాధ్యాయులు,విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు

# జాలిగామ అంగన్వాడీ కేంద్రంలో తల్లీ పాల వారోత్సవాలు

**సిద్దిపేట**




సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలా వారోత్సవాలు సామూహిక శ్రీమంతాలు అన్న ప్రాసన్న కార్యక్రమాలు చెయ్యడం జరిగింది ఈ కార్యమానికి ఐ సీ. డి ఎస్ సూపర్ వైజర్ భవాని ఐ సీ డి ఎస్ కిరణ్ హాజరైనారు వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు వచ్చే ముర్రుపాలు వ్యాధి నిరోధక టీకా లాంటివి బిడ్డకు తల్లీ పాలు అమృతం లాంటివి తల్లీ పాలు పసిబిడ్డకు శారీరకంగా మానసికంగా బిడ్డ ఎదుగుదలకు ఉపయోగ పడుతుంది అని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమానికి గర్భిణీలు బాలింతలు తల్లులు ఐ సీ డి ఎస్ భవాని.కిరణ్ అంగన్వాడీ టీచర్ అనిత.సునీత ఆశవర్కర్స్. లావణ్య. అరుంధతి. ఆయాలు రాజవ్వ. ఐలవ్వ. రాజేశ్వరి. పాల్గొన్నారు

# పేదలకు న్యాయం చేయాలి

**జనగామ,ఆగస్టు 04 సామాన్యుడి అస్త్రం దిన పత్రిక**

జనగామ పట్టణంలోని 400 సర్వే నెంబర్లు పేదలైన ప్లాటు యజమానులు కట్టుకుంటున్న ఇండ్లను కూలగొట్టిన ధర్మ కృష్ణారెడ్డి ఆయన అనుచరులు వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోట్ల శేఖర్ సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ జనగామ జనగామ పట్టణంలో 400 సర్వే నెంబర్లు లో 2002-2006 సంవత్సరంలో లేఅవుట్ ప్లాటింగ్ కొడితే అక్కడ కొంతమంది ఆటో కార్మికులు అమాలి కార్మికులు పేద రైతులు ఒంటరి మహిళలు కొనుక్కున్నారు అందులో ప్లాటుకున్న ఓనర్లు రూములు ఇల్లు కట్టుకుంటే ధర్మ కృష్ణారెడ్డి అనే వ్యక్తి 4 సర్వే నెంబర్ భూమితో ఎలాంటి సంబంధం లేకుండా ఈ భూమి నాదేనని దౌర్జన్యంగా కొంతమంది ఆయన అనుచరులుతో ఈరోజు ఉదయం 6 గంటలకు వచ్చి సుత్తెలు గన్నులు గడ్డపారలతో కొలగొట్టారు. ఇది దారుణం తక్షణమే ధర్మ కృష్ణారెడ్డి మరియు ఆయన అనుచరులను అరెస్టు చేసి కేసు నమోదు చేయాలి పేదలకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్ సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి డిమాండ్ చేశారు ఈసందర్భంగా వారు బాధిత ప్లాట్ యజమానులు వారి కుటుంబ సభ్యులతో నెహ్రూ పార్క్ నుండి డిసిపి ఆఫీసు వరకు సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి డిసిపి రాజమహేంద్ర నాయక్ గారికి ఫిర్యాదు చేశారు ఇండ్ల కూల్చివేతకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని వ్యక్తులందర్నీ కస్టడీకి తీసుకుంటామని డిసిపి రాజమహేంద్ర నాయక్ బాధితులకు హామీ ఇచ్చారు అక్కడ సీఐ దామోదర్ రెడ్డి ఎస్ఐలు రాజేష్ చెన్నకేశవులు ఉన్నారు
ఈకార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి పల్లెల లలిత ధర్మ బిక్షం అజ్మీరా సురేష్ నాయక్ కనకాచారి శివ సమ్మయ్య గాజుల నాగరాజు గట్టయ్య బంద్రు సత్తయ్య మంజుల లక్ష్మి ప్రసాద్ పరశురాములు నాగరాజు గంగరబోయిన మల్లేష్ రాజ్ సుమ మల్లేష్ రాజు ఆర్య తదితరులు పాల్గొన్నారు



# ఆదాయంపై ఉన్న ఆశ ఆదివాసుల మీద లేదా

**ఆదివాసి గూడాలల్లో కనిపించని రోడ్డు ,బడి, వైద్యం.**
**ఆదివాసి ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించని సర్కార్**
**ఆదివాసి ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే ,కనీస సౌకర్యాలు కల్పించాలని సోడే రవికుమార్ దొర డిమాండ్**

**మణుగూరు, ఆగస్టు 04 సామాన్యుడి అస్త్రం:**

తెలంగాణ సర్కార్ ఆదివాసి ప్రాంతాలలో ప్రతి గ్రామానికి వైన్ షాప్ టెండర్లు పిలవడాని మణుగూరు మండల ఆదివాసీ నాయకులు సోడే రవికుమార్ దొర తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం ఉన్న వైన్ షాపుల టెండర్ నవంబర్ 30తో ముగియనుండగా.. వచ్చే టర్మ్ నుంచి దీన్ని అమలు చేయాలని సూచనప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. దీనికి సంబంధించి మూడు రోజులుగా సెక్రెటేరియట్ లో ఎక్సైజ్ శాఖ అధికారులు సమావేశమై చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. ఆగస్ట్ మొదటి వారంలో కొత్త టెండర్ల ప్రక్రియను ప్రారంభించి స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా వ్యాపార నిబంధనల్లోనూ కొన్ని కీలక మార్పులు చేయనున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత.. నూతన కంపెనీల బ్రాండ్లను సైతం అనుమతించనున్నట్లు సమాచారం. 78 సంవత్సరాల పరిపాలన కాలంలో కనీస వసతులు కల్పించడంలో విఫలమైన ప్రభుత్వాలు, కేవలం ఆదాయం కోసమే ఆదివాసి గ్రామాలలో వైన్ షాపులు తీసుకో రావడం అనే ఆలోచన ఆదివాసి ప్రజలను కలవర పెడుతుందని వాపోయారు.

**గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు చేయండి**

వైద్య సదుపాయాలు లేక పల్లెలు అల్లాడుతూ పట్టణాల వైపు వైద్యం కోసం పరుగులు పెడుతున్నారు. చిన్న చిన్న వ్యాధులకు కూడా వైద్యానికి నోచుకోని పరిస్థితులు పల్లెల్లో అనేకం. అరకొర మందులతో ఆశా వర్కర్లే పెద్ద దిక్కు. ఎటువంటి తరుణంలో గ్రామాలకు కావాల్సింది రోడ్డు మార్గం నాణ్యమైన విద్య నాణ్యమైన వైద్యం గ్రామాలలో వీటిని బలోపేతం చేయడం వలన గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. మంచి బడి ఉంటే మంచి విద్యావంతులు అవుతారు. వివిధ పోటీరంగాలలో పోటీ పడి కొలువులు సాధించుకుంటారు. మంచి వైద్యాశాల ఉంటే నిత్యం ఆరోగ్యంతో కాయకష్టం చేసుకొని ఎవ్వరి కాళ్ళ మీద వాళ్ళు బ్రకుతారు. అంతేగాని గ్రామానికో మద్యం షాప్ వల్ల ప్రభుత్వానికి ఆదాయం తప్పితే గిరిజన గ్రామాలకు ఒరిగేది ఏమి ఉండదు. ఇప్పటికే బెల్ట్ షాపులతో ప్రజలు సతమతం అవుతుంటే గ్రామానికో మద్యం షాప్ అని గిరిజన ప్రజల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దు.



**మద్యం షాపులను ఆహ్వానిస్తే గ్రామాలు అంధకారమే**

మద్యం షాపులను గ్రామాలలోకి ఆహ్వానం పలికితే మన బ్రతులలో అంధకారమే మిగులుతుంది. ఎప్పటికే బెల్ట్ షాపులు నాలుగు ఇళ్ల కు ఒకటి చొప్పున ఉన్నది.వీటినే ఎలా తట్టుకోవాలి అని మహిళలు తలలు పట్టుకుంటున్నారు. వీటినే తొలగించే మార్గం ఎలా రా దేవుడా అని మహిళలు అనుకుంటుంటే మళ్ళీ మద్యం షాపులు ఏంటి అని ఆశ్చర్యపోతున్నారు.

**ఏజెన్సీ ఎమ్మెల్యేల మౌనమేల?**

ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన మీకు ఈ ప్రాంత ప్రజల జీవన కష్టాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మీకు తెలియనివి కావు. మద్యం గ్రామాలలో తీసుకురావడం అనేది అనాలోచిత నిర్ణయం అయినా కూడా ఏజెన్సీ ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది మిమ్మల్ని ఎన్నుకున్నదే మా తరఫున పోరాటం చేసి మా బ్రతుకులు మారుస్తారని ఇటువంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకున్నప్పుడు కూడా ప్రశ్నించకపోవడం ఎంతవరకు సమంజసం. ఈ నిర్ణయంపై ఏజెన్సీ ఎమ్మెల్యేలు కచ్చితంగా స్పందించాలి గ్రామాలలో వైన్ షాపులను ఎట్టి పరిస్థితులలో ఆహ్వానించే ప్రసక్తే లేదు అలాగే ఇప్పుడు ఉన్నటువంటి బెల్టు షాపులను కూడా పూర్తిగా నిర్మూలించాలని కోరుతున్నాను.

# దళితుల జోలికి వస్తే ఊరుకోం స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలైనా దళితులకు అవమానం..

**దళిత వాడకు నాలుగు దిక్కులుగా ఇనుప ముళ్ళ కంచె వేయడం సరికాదు..**
**ఇనుప ముళ్ల కంచను తొలగించి దళిత ఇండ్లకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి..**
**దళితులను అవమానపరిచిన వారి పైన చట్ట పరమైన చర్యలు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్..**
**మాల మహానాడు రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మహేష్ మాల**



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్**

దళితుల జోలికి వస్తే ఊరుకోం బూర్గుల గ్రామంలో దళితుల ఇండ్ల చుట్టూ ఇనుప కంచలు వేయడమే కాకుండా కులం పేరుతో దూషించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదు. దళితులను కించపరిచి మాట్లాడిన వారిపైన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. దళిత ఇండ్లకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులను డిమాండ్ చేస్తున్నాం.దళితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటాం స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాల అయినా కూడా దళితవాడను నాలుగు దిక్కులుగా ముళ్ళకంచెతో నిర్బంధం ఈ దేశంలో ఎన్నో హక్కులు చట్టాలు ఉన్న కూడా అడుగు అడుగున దళితులకు ప్రతి పల్లెలో అవమానం మా ఇళ్లకు ఆరు నెలల నుండి నాలుగు దిక్కులకు ఇనుప ముళ్ళ కంచెను వేయడం జరిగింది మరి మేము ఎటు వెళ్లలేని పరిస్థితి దళితులకు అన్యాయం ఉపేక్షించేది లేదని న్యాయం జరిగేంత వరకు పోరాడుతాం అని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు..

## తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మర్యాదపూర్వకంగా కలసిన పూదరి శివకుమార్ గౌడ్

**సామాన్యుడి అస్త్రం ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ :**



నేడు చలో డిల్లీ కార్యక్రమంలో భాగంగా చర్లపల్లి నుండి ఢిల్లీ కి ప్రత్యేక రైల్లో వెళు న్న సందర్భంగా మార్గమధ్యంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మీనాక్షి నటరాజన్ తో కాంగ్రెస్ పార్టీ సంస్థ గత విషయాలు చర్చించడం జరిగింది అని దానికి మీనాక్షి నటరాజన్ సానుకూలంగా స్పందించి రాబోయే రోజులలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తను సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు అని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం సీనియర్ నాయకులూ పుదారి శివకుమార్ గౌడ్ తెలిపారు .

## ఇంకెంతకాలం ఈ నరకయాతన?


**చటాన్ పల్లి గుంతల రోడ్డుతో తప్పని తిప్పలు..**
**తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు..**



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్**

చటాన్ పల్లి నుంచి రిజిస్టర్ ఆఫీసు వరకు సాగిన ప్రధాన రహదారి గుంతలతో నిండిపోయి ప్రజలకు నరకయాతనను మిగిలిస్తోంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగుతున్న ఈ మార్గం ఇప్పుడిక తీవ్ర ప్రమాదాలకు దారితీసే స్థితికి చేరుకుంది. ఈ రోడ్డులో చోటుచేసుకుంటున్న ప్రతీ గుంత ప్రయాణికుల నష్టం కలిగించేలా మారుతున్నాయి. వర్షాలు పడిన ప్రతీసారీ ఈ రహదారి మరింత ప్రమాదకరంగా మారుతుండటం, ప్రజలు నీటి లోతుల్లో వాహనాలతో కిందపడిపోతూ గాయాలపాలవుతున్న సంఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి.ఈ పరిస్థితులపై పలుమార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమని వాపోతున్నారు. ఇది నగరానికి ద్వారంగా నిలిచే ప్రధాన రహదారి. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రజల ఇబ్బందులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తాత్కాలికంగా అయినా మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించాలని, ఈ సమస్యను ప్రత్యేక చొరవ చూపి తక్షణమే ఈ రహదారి మరమ్మతులు చేపట్టాలి. ఇది సాధారణ అభివృద్ధి కాదు, ప్రజల ప్రాణాలతో కూడిన బాధ్యతగా గుర్తించి, ప్రజల సమస్యల పట్ల చలనం కనబరచాలని ప్రజలు వేడుకుంటున్నారు..

## గడప గడప కి బీజేపీ అభివృద్ధి ఫలాలు



**జనగామ,ఆగస్టు 04 సామాన్యుడి అస్త్రం దిన పత్రిక**

గడపగడప బిజెపి కార్యక్రమాన్ని ఈరోజు నెల్లుట్ల గ్రామంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ రావడం జరిగింది బిజెపి అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరే విధంగా గడపగడప ప్రోగ్రాం నిర్వహించి ప్రతి ఒక్క గృహంలో బిజెపి అభివృద్ధి కార్యక్రమాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగరాంమోహన్ రెడ్డి కేవీలన్ రెడ్డి శివరాజు యాదవ్. బొమ్మ కంటి అనిల్. జంగానరసింహారెడ్డి .పెద్దోజు జగదీష్. కేశపురం రవిరాజ్. గొరిగి సంపత.తోకల హరీష్.దూసరరి శివకృష్ణ. మొదలగువారు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

## వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం

**జనగామ,ఆగస్టు 04 సామాన్యుడి అస్త్రం దిన పత్రిక**



మనస్విని పుట్టినరోజు సందర్భంగా పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు సింగరాజుపల్లి గ్రామానికి చెందిన జోగు వెంకటేశ్వర్లు శారద దంపతుల కుమార్తె మనస్విని పుట్టినరోజు సందర్భంగా, జనగామ పట్టణంలోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒక పూట ఆకలిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. నిత్యావసర సరుకులు, వస్త్రదానం చేయడం ద్వారా సామాజిక బాధ్యతను నెరవేర్చాలి. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యువత అందరూ ఈ విధమైన సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి. ఈ ప్రయత్నం ద్వారా భారతదేశంలో ఆకలి చావులు లేకుండా చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో జోగు భాస్కర్, ఏదునూరి రాజు, కర్రి రాజశేఖర్, శంకర్, జోగు ఉదయ్, మను, నరేంద్ర పవన్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత వాడకు కంచె..!

**"బూర్గుల"లో దళితుల పై దారుణం.. పశువుల మంద స్థలం మాదే అంటూ కంచె**

**ఆరు నెలలుగా దళితవాడకు "చుట్టూరా కంచె".. దళితులు ఇండ్ల నుండి బయటకు రాకుండా అడ్డంగా దాష్టీకం**

**మూడు నెలల క్రితం కంచే దాటుతూ వైర్లు తగిలి దళిత చెన్నయ్య మృతి**

**స్వాతంత్ర్య సమర యోధుడు, బూర్గుల నర్సింగరావు కుటుంబ సభ్యుల చర్యలతో గ్రామస్తుల మనస్తాపం**

**ఆరు నెలలుగా అవస్థలు పడుతున్న దళితులు**

**ఇంటి నిర్మాణం కోసం కంచెను ముట్టుకున్న పాపానికి కులం పేరుతో దూషిస్తూ, బండ బూతులు**





సామాన్యుడి అస్త్రం షాద్ నగర్

స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నాయకుడు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో అతను కీలక పాత్ర పోషించాడు. రక్షణ కౌలుథారు చట్టాన్ని అమలు చేయాలని ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించాడు అతను ఎవరో కాదు బూర్గుల నర్సింగరావు.. ఆయన ఆశయ సాధనకు పని చేయాల్సిన కుటుంబ సభ్యులు కొందరు ఈ జాగా మాది మా నిర్ణయానికి ఎవరు అడ్డు చెబుతారు? అనే ధోరణితో దళితవాడలో చుట్టూరా కంచే నిర్మించి పైశాచిక ఆనందం పొందిన వ్యక్తుల తీరుపై బూర్గుల గ్రామ దళితులు రగిలిపోతున్నారు. నవ సమాజ నిర్మాణం, సమ సమాజ ఏర్పాటు కోసం కృషిచేసిన కీర్తిశేషులు తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు స్వగ్రామం బూర్గులలో ఆయన స్వయాన బంధువులే ఇలాంటి చర్యలకు పాల్పడతారని తాము కలలో కూడా ఊహించలేదని గ్రామస్తులు బాధిత దళితులు మనస్థాపం చెందుతున్నారు. ఈ స్థలం మాది అంటూ చుట్టూ కంచె వేయడం అవి దళితుల ఇండ్ల గడపలకు అడ్డంగా మారడం లాంటి వికృత చేష్టలు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రానికి కూత పెట్టు దూరంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు బూర్గుల రామకృష్ణారావు స్వగ్రామం బూర్గులలో చోటుచేసుకున్నాయి.

**అసలు విషయం ఏమిటంటే..?**

ఫరూఖ్ నగర్ మండలం బూర్గుల గ్రామంలో సర్వేనెంబర్ 130లో స్వాతంత్ర సమరయోధుడు బూర్గుల నర్సింగరావు ఈ స్థలాన్ని గ్రామ అవసరాల నిమిత్తం అందజేశారు. రెవెన్యూ రికార్డులలో కూడా పశువుల మంద స్థలంగా రికార్డుకు ఎక్కింది. ఇక్కడ గ్రామపంచాయతీ వారు అనాదిగా నాలుగు బోర్లు వేయించారు. ప్రస్తుతానికి గ్రామానికి నీటి సరఫరా కూడా ఈ స్థలంలో నుండే జరుగుతుంది. అంతేకాదు పశువుల మంద ఉండడానికి వాటికి నీటి అవసరాలు తీర్చేందుకు ఓ తొట్టిని కూడా నిర్మించారు. చాలాకాలంగా గ్రామ అవసరాలకు 4బోర్లు ఉపయోగపడుతున్న ఈ భూమికి ఆనుకొని దాదాపు చాలామంది దళితులు ఇల్లు నిర్మించుకొని అక్కడ జీవిస్తున్నారు. ఈ స్థలం నుండి గ్రామంలోకి రాకపోకలు జరుగుతుంటాయి. ఎంతో దూర దృష్టితో బూర్గుల నర్సింగరావు కొంత స్థలాన్ని మాత్రమే గ్రామ మధ్యలో పశువుల మంద పేరిట వాటి అవసరాల కోసం కేటాయించారు.

**ఇప్పుడేం జరిగిందంటే..?**

సర్వేనెంబర్ 130లో గల సుమారు 20 గుంటల పైచిలుకు స్థలం మాదేనని నరసింహారావు కోడలు విజయలక్ష్మి ఈ స్థలానికి చుట్టూ కంచే నిర్మించారు. ఇందులోనే గ్రామపంచాయతీ నాలుగు బోర్లు ఉండడం గమనార్హం. అంతేకాదు పశువులకు నీటి తొట్టి కూడా ఈ స్థలంలోనే ఉంది. ఇక ఈ కంచెకు అటువైపుగా దళితుల ఇండ్లు ఉన్నాయి. పేద ప్రజలకు అండగా ఇన్నాళ్లు బూర్గుల నర్సింగరావు కుటుంబం నిలబడింది. ఇప్పుడు ఉన్నఫలంగా ఆయన సమాజం కోసం కేటాయించిన ఒక ఎకరా 10 గుంటల భూమిలో ఇప్పటికే ఎందరో పక్క ఇండ్లు కూడా నిర్మించారు. మిగిలిన స్థలంలో గ్రామపంచాయతీ తమ అవసరాలకు ఈ స్థలాన్ని వాడుకుంటుంది. ఇందులోనుండి అవతలి వైపు ఉన్న దళితులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. హఠాత్తుగా ఆరు నెలల క్రితం ఈ స్థలం మాదేనని చుట్టూ కంచ నిర్మించారు. దీంతో అవతలి వైపు ఉన్న దళితుల ఇండ్లకు రాకపోకలు తెగిపోయాయి. ఇనుప కంచెను దాటేందుకు వైర్ల కింది నుండి ఎన్నో గాయాలపాలై బతుకు జీవుడా అంటూ ఇప్పుడు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇది ఏం వైపరీత్యమో ఇంకేంటో తెలియదు కానీ హైటెక్ యుగం వైపు వెళ్తున్న ఈ సమాజంలో ఇలా దళితులు అంటూ వారిని గిరిగిసి మరి రాకపోకలు నిషేధించడం సమంజసం కాదని అంటున్నారు. బూర్గుల నర్సింగరావు చేసిన దేశసేవ సమాజసేవ ముందు ఇలాంటివి బయటపెట్టి ఎందుకు ఆయన పేరు ప్రతిష్టలకు ఆయన కుటుంబానికి మచ్చ తేవాలని కొంతకాలంగా ఆగామని కానీ ఇప్పుడు విజయలక్ష్మి ఫోన్ నుండి గ్రామానికి చెందిన హరి అనే యువకుడికి ఒకరు ఫోన్లో దూషించడం కులం పేరుతో తిట్టడం లాంటి చర్యలతో గ్రామం అట్టుడుకుతుంది. హరి అనే యువకుడు అవతలి వైపు ఇల్లు కట్టుకుంటున్నాడు. తన రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఒకవైపు ఫినిషింగ్ వైర్ ను తొలగించి అందులోకి రాకపోకలు చేస్తున్నాడు. ఈ వైరు ఎందుకు తొలగించావంటు విజయలక్ష్మి ఫోన్ చేయగా ఆమె ఫోన్ మరొకరు లాగుకొని బండ బూతులు తిట్టాడు. అతను అజయ్ బాబు అని బాధితులు పేర్కొంటున్నారు. కులం పేరుతో దూషించాడు. ఫినిషింగ్ వైరును తీయాలంటే మీ పశువులను మా వద్ద కట్టేయండి లేదా మీ ఇంట్లోకి వచ్చి నేను ఉంటా మీరు ఊరుకుంటారా అంటూ హుకుం జారీ చేశాడు. ఫోన్లో మాట్లాడిన ఈ మాటలను మన బూర్గుల గ్రామ వాట్సాప్ గ్రూప్ లో పెట్టడంతో ఈ విషయం బయటి సమాజానికి పోక్కింది.

**దారుణంగా అవమానిస్తున్నారు**

మమ్మల్ని దళితులని చిన్నచూపు చూస్తున్నారని దారుణంగా అవమానిస్తున్నారని బూర్గుల రామకృష్ణారావు నర్సింగరావు లాంటి పెద్దమనుషుల ముఖాలు చూసి వారు చేసిన సేవ చూసి మేము ఏం చెప్పాలో కూడా తెలియట్లేదని గ్రామ దళితులు చెన్నమ్మ చంద్రయ్య ఈశ్వరమ్మ బాలమ్మ పెద్ద జంగయ్య రామయ్య చిన్నకృష్ణయ్య పెద్ద కృష్ణయ్య చెన్నయ్య రామకృష్ణ ఆంజనేయులు తదితర దళితులు మీడియా ముందు వాపోయారు. కులం పేరుతో దూషించడమే కాకుండా తమను నీచంగా చూస్తున్నారని తమ పశువులను కట్టివేస్తే కంచే తీస్తామని లేకపోతే మీ ఇండ్లలో వచ్చి ఉంటామని నీచంగా మాట్లాడారని బాధితులు ఆరోపించారు.

**కొమ్ముగారి చెన్నయ్య మృతి**

మా ముసలోడు ఇనుప కంచే దాటుతూ రాతి స్తంభం ఇనుప వైర్లు తగిలి గాయాలపాలై మృత్యువాత పడ్డాడని బాధితురాలు కొమ్ముగారి చెన్నమ్మ మీడియా ముందు బోరున విలపించింది. అయినా తాము బూర్గుల నర్సింగరావు సేవలు గుర్తించుకొని దొరలపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆమె అమాయకత్వంగా మీడియా ముందు పేర్కొంది. చీటికిమాటికి పోలీసులు వచ్చి కంచ గురించి ఎవరు డిస్టర్బ్ చేయొద్దని చెప్పి వెళ్లారని పోలీసులను పెట్టి తమను బెదిరిస్తున్నారని దళితులు వాపోయారు. తమను అవమానించిన తాము పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయలేదని అది వారిపై మాకు ఉన్న అభిమానమని ఈ సందర్భంగా పేర్కొనడం గమనార్హం. తామే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు తలుచుకుంటే చేసేవారిని కానీ తాము మంచితనంతో వ్యవహరిస్తున్నామని తమ మంచితనాన్ని అసలాగా చేసుకుని గ్రామానికి కేటాయించిన భూమిని తిరిగి లాక్కొని కంచె వేయడం తమ రాకపోకలకు ఇబ్బంది సృష్టించడం ఏం మానవత్వమని ఆమె ప్రశ్నించారు.

**గ్రామంలో గరం గరం**

గ్రామానికి చెందిన దళిత యువకుడు హరిని పులనాడిన వ్యవహారంలో విజయలక్ష్మి తిరుపతి గ్రామస్తులు ఆక్షేపన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సంబంధించిన వాట్సప్ గ్రూపులో తిట్టిన ఆడియో రికార్డును వేయడంతో అందరూ ఇది విని నిట్టూరుచుతున్నారు. ఇదేం పద్ధతిని మండిపడుతున్నారు. ఒక వ్యక్తి చనిపోయిన ఎంతోమంది రాకపోకలు లేకుండా ఇబ్బంది పడుతున్న ఏనాడు పల్లెతి మాట అనలేదని కానీ ఘోరంగా తిట్టిన ఈ ఆడియోలు విని మాత్రం దళితులు ఇప్పుడు మీడియా దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు వెంకటయ్య గౌడ్, బాధితుడు హరి, రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ.. తమ ఆవేదన మీడియా ముందు వినిపించారు. ఈ స్థలంలో బూరుగుల నర్సింగరావు లైబ్రరీ నిర్మించాలని ఆయన ఆశయమని అదేవిధంగా పశువుల మంద కోసం కేటాయించిన ఈ స్థలాన్ని ఇప్పుడు స్వాధీనం చేసుకొని తమను చిన్నచూపు చూడడం జరిగిందని వారు ఆవేదన చెందారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన బోర్లు ఇందులోనే ఉన్నాయని గ్రామానికి నీటి సరఫరా చేయడానికి వచ్చే సిబ్బంది పట్ల కూడా బెదిరింపులకు దిగుతున్నారని ఇది చాలా దారుణమని వారు వాపోయారు. దీనిపై ఆయా రాజకీయ పార్టీల నాయకులు మేధావులు ప్రజాసంఘాల నాయకులు న్యాయం చేయాలని ప్రభుత్వం తమకు దారి చూపాలని దళితులు వేడుకుంటున్నారు..

## విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



సామాన్యుడి అస్త్రం: కోనరావుపేట

కోనరావుపేట మండల పరిధిలోని కొలనూరు గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

## ఛలో ఢిల్లీ బీసీ గర్జన ధర్నా కార్యక్రమానికి తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు




సామాన్యుడి అస్త్రం: కోనరావుపేట

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో డిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5,6,7 తేదీలలో చేపట్టబోయే బీసీ గర్జన మహా ధర్నా కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడ నియోజకవర్గం నుండి సోమవారం తరలి వెళ్ళారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ లు కచ్చుకాయల ఎల్లయ్య, చిలుకల తిరుపతి,వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం,కనికరపు రాకేష్,మండల అధ్యక్షులు తూము జలపతి,పిల్లి కనకయ్య,వకుళాభరణం శ్రీనివాస్,బ్లాక్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి,మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, పీసీసీ సభ్యులు తోట్ల అంజయ్య,కూరగాయల కొమురయ్య,గండి నారాయణ,సోషల్ మీడియా కోఆర్డినేటర్ అరుణ్, తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం.. ..

**లబ్ధిదారుల ఇండ్లకు ముగ్గు పోసి ప్రారంభించిన మార్కెట్ చైర్మన్**

సామాన్యుడి అస్త్రం కమలాపూర్ మండలం బచ్చల శ్రీకాంత్





కమలాపూర్ మండల కేంద్రంలో మరియు కొత్తపల్లి గ్రామాలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ ఇందిరమ్మ ఇండ్లు ముగ్గులు పోసి ప్రారంభించినారు .. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ, ఇప్పటివరకు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు స్టేట్ వైస్ గా సత్వరమే బిల్లులు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతున్నాయని, ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించని వారు ఎవరైనా ఉంటే వారు వెంటనే ప్రారంభించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్మాణ విషయంలో కానీ బిల్లుల చెల్లింపు విషయంలో కానీ ఎలాంటి ఇబ్బందులు ఏర్పడ్డ మేము అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపినారు అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించడం జరిగింది... ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోడేటి బిక్షపతి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గూడెపు మొగిలయ్య, మాజీ ఉపసర్పంచ్ మౌటం రమేష్ ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పెరుమాండ్ల పరుశరాములు, కంభంపాటి ప్రసాద్, కొత్తపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటికంటి రమేష్, గుంటుక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపిన దమ్మున్నోడు రేవంత్ రెడ్డి



**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. నాయకులు, సెలబ్రిటీలు సైతం డ్రగ్స్ కు బానిసలు అయ్యారు**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంచలన విమర్శలు.. యునైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "డ్రగ్ ఫ్రీ" షాద్ నగర్ కార్యక్రమం**

**యాంటి నార్కోటిక్ బ్యూరో పి సీతారాం, సైదులు, డీఎస్పీ సైదులు, ఏసిపి లక్ష్మీనారాయణ, సిఐ విజయ్ కుమార్ తదితరులు**

**డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిం చడమే అందరి లక్ష్యమని అధికారుల పిలుపు... 1500 మంది విద్యార్థులతో డ్రగ్స్ ఫ్రీ షాద్ నగర్ కార్యక్రమం విజయవంతం**

**విజయ కార్డియాక్ ఆసుపత్రి అధినేత డాక్టర్ చందూలాల్ రాథోడ్ సౌజన్యంతో కార్యక్రమం**

**యూత్ కరేజ్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించిన ఎమ్మెల్యే, పోలీసు శాఖ**




సామాన్యుడి అస్త్రం షాద్ నగర్

తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్లలో విచ్చలవిడిగా డ్రగ్స్ దందాలు నడిచాయని, నాయకులు సైతం డ్రగ్స్ కు బానిసలు అయ్యారని భవిష్యత్తు ఉన్న రాష్ట్రాన్ని నాశనం చేశారని యువత మత్తు వైపు ప్రేరేపితం చేశారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో దమ్ము ధైర్యంతో డ్రగ్స్ ఫ్రీ తెలంగాణగా మార్చేందుకు ఉక్కు పాదం మోపారని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఈడెన్ ప్లాజాలో యునైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక విజయ కార్డియాక్ ఆసుపత్రి అధినేత డాక్టర్ చందూలాల్ రాథోడ్ సౌజన్యంతో సుమారు 1500 మంది విద్యార్థులతో "డ్రగ్స్ ఫ్రీ షాద్ నగర్" కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ఫౌండేషన్ సభ్యులు ఆహ్వానించగా యాంటి నార్కోటిక్ బ్యూరో పి సీతారాం, సైదులు, డీఎస్పీ సైదులు, ఏసిపి లక్ష్మీనారాయణ, సిఐ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీఖాన్ బాబర్ స్థానిక నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిం చడమే అందరి లక్ష్యమని అన్నారు. యాంటీ డ్రగ్ సమాజాన్ని నిర్మించాలని ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.తల్లిదండ్రులు విద్యార్థులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని మత్తుకు బానిసలుగా మారి వారి ఆశయాలను వమ్ము చేయకూడదని ఎమ్మెల్యే కోరారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించేందుకు బాధ్యత గల పౌరులుగా వ్యవహరించి యువత భాగస్వామ్యం కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలలో డ్రగ్స్ గంజాయి తదితర మొత్తుపదార్థాలు విచ్చలవిడిగా వాడేవారని, కానీ ముఖ్యమంత్రి రెడ్డి ఎంతో ధైర్య సాహసాలతో వాటిని నిర్మూలించేందుకు డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాయకులు సైతం డ్రగ్స్ కు బానిసలు అయ్యారని సంచలన వ్యాఖ్యలు చేశారు. యాంటి నార్కోటిక్ బ్యూరో పి సీతారాం, సైదులు, డీఎస్పీ సైదులు, ఏసిపి లక్ష్మీనారాయణ, సిఐ విజయ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు, యువత తమ పరిసరాలు, విద్యాలయాలు, ఇతర చోట్ల ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా, తరలించినా సమాచారం అయ్యా బాధ్యతగల సంస్థలకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌రహిత సమా జంతో రాష్ట్రంలాగే దేశం ఉన్నతంగా ఉంటుందన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ యాంటీ డ్రగ్స్ సోల్జర్‌గా మారాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులు అందరూ కలిసి డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేశారు.యునైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ నిర్వాహకులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయా శాఖల అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి,డాక్టర్ చందులాల్ రాథోడ్, ప్రముఖ మహిళ న్యాయవాది సబియా సుల్తానా, చెంది తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, లింగారెడ్డిగూడెం అశోక్, అదేవిధంగా యూత్ కాలేజ్ అసోసియేషన్ నిర్వాహకులు ఉస్మాన్, సోహెల్, ముతలీఫ్ జామి, వంశీ కృష్ణ, అక్రమ్, షోయబ్, నాగరాజ్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు..

# సుంకిరెడ్డి - మొబైల్ హెల్త్ క్యాంప్ ప్రారంభం






**మీ ఆరోగ్యం - మా బాధ్యత ప్రతి గ్రామంలో సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంప్ ప్రతి ఇంటికి ఆరోగ్యం...**

**ఆరోగ్యవంతమైన కల్వకుర్తి లక్ష్యంగా సుంకిరెడ్డి**

సామాన్యుడి అస్త్రం ప్రతినిధి కల్వకుర్తి నియోజకవర్గం (కల్వకుర్తి) :

నియోజకవర్గంలోని ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో గ్రామ,గ్రామాన ఏర్పాటు చేయనున్న.. "సుంకిరెడ్డి - మొబైల్ హెల్త్ క్యాంప్"లను..ఉద్దేశించి వెల్దండ మండల కేంద్రంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి హాజరైన... ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మరియు టాస్క్ - సి.ఓ.ఓ రాఘవేందర్ రెడ్డి ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశ్యం... ఆరోగ్యవంతమైన కల్వకుర్తికై ప్రతి గ్రామానికి సుంకిరెడ్డి - మొబైల్ హెల్త్ క్యాంప్ సేవలు.. మా ఐక్యత ఫౌండేషన్ యొక్క ముఖ్య లక్ష్యం నియోజకవర్గ వ్యాప్తంగా... విద్య - వైద్యం - ఉపాధి రంగాలలో ప్రతి కుటుంబానికి అండగా ఉండాలనే ధృడ సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని, మా సంకల్పం ప్రతి గ్రామానికి,ప్రతి కుటుంబానికి ప్రాథమిక వైద్యసేవలు ఉచితంగా అందుబాటులో ఉంచి, ఆరోగ్యవంతమైన నియోజకవర్గంగా చూడాలనే ప్రయత్నం చేస్తున్నానని తెలియజేస్తూ, మేము ఏర్పాటు చేస్తున్న సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంప్ లను ప్రముఖ వన్ మెడి హబ్ అనే సంస్థతో కలిసి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్నామని, సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్లినిక్ యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు... ప్రతి గ్రామానికి,ప్రతి కుటుంబానికి ఉచిత ప్రాథమిక వైద్యసేవలను అందించడం, పెద్ద పెద్ద వ్యాధులను ముందుగా గుర్తించి,వాటిని అడ్డుకోకునే,సూచనలు సలహాలు, ప్రతి మారుమూల గ్రామంలో కూడా ఆరోగ్యం పై అవగాహన కల్పించి,వారిని చైతన్య పరచడం, సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంప్ ఆధునాతన టెక్నాలజీ తో రూపొందించిన వన్ మెడి హబ్ మొబైల్ యూనిట్ ద్వారా ఒక గంటలో 150 పైగా పరీక్షలు నిర్వహించే సామర్థ్యంతో డిజైన్ చేయడం జరిగిందని, ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు చాలా ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ అని,ఖర్చుకి వెనకడుగు వేస్తూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న మారుమూల గ్రామ ప్రజలకు దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమంతో ముందుకు వెళుతున్నామని,ముఖ్యంగా లివర్ కి సంబంధించి బిల్రుబిన్,కిడ్నీలకు సంబంధించి క్రియాటిన్,గుండెకు సంబంధించి కొలెస్ట్రాల్ మరియు కాల్షియం, యూరియా,షుగర్ మొదలగు టెస్ట్ లను ఉచితంగా మారుమూల గ్రామాల ప్రజలకు అందించి,వారికి అవగాహన కల్పించడం ముఖ్య లక్ష్యం అని తెలియజేశారు.మా మొదటి క్యాంప్ ఆమనగల్ మండలం మేడిగడ్డ తండాలో ఈనెల 6వ తారీఖు బుధవారం ప్రారంభించబోతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వన్ మెడి హబ్ ఫౌండర్ సంతోష్ కుమార్ , వెల్దండ సీనియర్ నాయకులు,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రైతులు పడుతున్న కష్టాలపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం

**అందజేసిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి**



సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతులు పడుతున్న కష్టాలపై ఈ రోజు అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి . ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి , అమలాపురం పార్లమెంట్ కోఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ , ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ , బొమ్మి ఇశ్రాయేల్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ , అమలాపురం కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ,రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ,మాజీ శాసనసభ్యులు పాముల రాజేశ్వరి దేవి , చెల్లుబోయిన శ్రీను ,పితాని బాలకృష్ణ మరియు ప్రజాప్రతినిధులు ,ముఖ్య నాయకులు పాల్గొన్నారు .

## మోసగాళ్లు తిరుగుతున్నారు జాగ్రత్త.?

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక



రావులపాలెం మండలం లో పలు గ్రామాల్లో తిరుగుతూ తక్కువ వడ్డీకి లక్ష రూపాయలు లోను ఇస్తాము అని మాయ మాటలు చెప్పి ఒక్కొక్కరి దగ్గర 3300/- చొప్పున వందల మంది దగ్గర డబ్బులు తీసుకుని టోకరా పెట్టారు భీమవరం దగ్గర ఒకరిది జువ్వలపాలేం మరోకరు ....అని చెప్పి మాది ఫైనాన్స్ కంపెనీ ఊరురా తక్కువ వడ్డీకి ఒక్కొక్కరి కి లక్ష రూపాయలు లోను ఇస్తాము అని చెప్పి ఊర్లలో కూలికి వెళ్లే వారిని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారిని టార్గెట్ గా చేసుకుని వారి బలహీనతలే వీళ్లకు సులువుగా మోసం చేయడానికి మార్గంగా ఎంచుకొని డా.బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా లోని మండలాలు లో లక్ష రూపాయలు లోన్ ఇస్తావ్ అయితే ముందు మా దగ్గర ఏదైనా వస్తువు కొనాలి ఆ వస్తువు ఖరీదు 3300 ఆ డబ్బులకి మీకు వస్తువుని ఇస్తాము అని చెప్పి ఒకరోజు ముందు పేర్లు రాసుకొని డబ్బులు తీసుకుని మళ్ళీ కనపడకుండా పరారవుతున్నారు...

## ఇంటర్ విద్యార్థినులకు ఏకరూప దుస్తులు అందజేసిన దాతలు.




సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కపీలేశ్వపురం మండలం మాచర ప్లస్ టూ ఉన్నత పాఠశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థినులకు దాతలు సహకారంతో ఉచిత ఏకరూప దుస్తులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.విజయకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు మాచర అలూమిని సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ, గొడవర్తి భగవన్నారాయణ, వీధి కామరాజు, దిగుబడి శ్రీరాములు ల సౌజన్యంతో 22 మంది ఇంటర్ విద్యార్థినులకు రెండేసి జతల చొప్పున పదహారు వేల రూపాయల విలువజేసే ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ప్రధానోపాధ్యాయులు విజయకుమార్ అభినందించగా కార్యక్రమంలో అలూమిని సభ్యులు గుడాల వెంకటరమణ, ప్లస్ టూ ఉపాధ్యాయులు నూకపెయ్యి వెంకట్ రావు, షిరిడి సాయి, రాయుడు ఉదయ్ కృష్ణ, ఉపాధ్యాయులు జి.వి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మాజీ శాసనసభ్యులు అన్నా రాంబాబు

(సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక: డిస్టిక్ స్టాఫ్ రిపోర్టర్)



ప్రకాశం జిల్లా మార్కాపురం .. మార్కెట్ యార్డ్ సమీపంలో స్కూల్ వ్యాన్ , బైక్ ఢీ కొట్టుకొని బైక్ పై వెళున్న ఇద్దరికీ తీవ్ర గాయాలు , అటుగా వెళుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అంబులెన్స్ ఆలస్యం అవ్వడంతో ఆటోలో క్షతగాత్రులని మార్కాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు ఇద్దరు టాటా క్యాపిటల్ మైక్రోఫ్యాన్స్ నందు పనిచేస్తున్న ఉద్యోగులుగా తెలిసింది.

## అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక డిస్టిక్ స్టాఫ్ రిపోర్టర్



అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మార్టూరు సమీపంలోని ద్రోణాదుల వైన్ షాపుల వద్ద సోమవారం వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు ఇంకొల్లు మండలం నాగండ్ల ఎస్సీ కాలనీకి చెందిన మురికిపూడి విజయ్ శేఖర్రావు (64) గా పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు

## హుజురాబాద్ లో జరిగే గద్దర్ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయాలి

**గద్దర్ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయండి.**

**శనిగరం బాబ్జి పిలుపు**



సామాన్యుడి అస్త్రం ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ :

ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ రెండో వర్ధంతిని విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శనిగరం బాబ్జి పిలుపునిచ్చారు. ఈనెల 8న హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్లో జరగనున్న ఈ సభకు పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.సోమవారం హుజురాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పీడిత, తాడిత ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గద్దర్‌కు ఘన నివాళులు అర్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతి సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్, ప్రధాన వక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాసిం హాజరవుతారని తెలిపారు.ఈ సందర్భంగా, పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కళాకారులచే గద్దర్‌కు ఆట, పాటల రూపంలో నివాళి కార్యక్రమం ఉంటుందని, అనంతరం అక్కడి నుండి సిటీ సెంట్రల్ హాల్ వరకు ర్యాలీగా వెళ్తామని ఆయన వివరించారు. కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, విద్యావంతులు, ప్రజాసంఘాల నాయకులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని గద్దర్ ఆశయాలను స్మరించుకోవాలని బాబ్జి కోరారు. ఈ సమావేశంలో ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు రామంచ భరత్, డప్పు వాయిద్య కారుడు ఎర్ర సురేష్, ప్రముఖ గాయకుడు రావుల సాయి పాల్గొన్నారు.

## స్నేహబంధం.. స్నేహితుల దినోత్సవ వేడుక

సామాన్యుడి అస్త్రం కమలాపూర్ మండలం బచ్చల శ్రీకాంత్






హనుమకొండ జిల్లా
కమలాపూర్ మండల భీంపల్లి గ్రామంలో స్నేహితుల దినోత్సవాన్ని పునస్కరించుకొని స్నేహితులంతా కలిసి కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు
స్నేహ భావం
చెమర్చిన కళ్లనద్దే చేతి స్పర్శ
స్నేహం..
తడబాటులో వెన్నునంటే
దిద్దుబాటు స్నేహం...
బతుకు ప్రవాహంలో
ఆటంకాల అడ్డుకట్టలను
దాటించే అందమైన జలపాతం
స్నేహం..
ఆవేదన చీకట్లు అలుముకొనే
వేళ ఉదయించే ఉషోదయం
స్నేహం..
గుండెలు పిండే వేదనలో
వేడుకల వచ్చే వసంతం స్నేహం..
కాలం కక్షగట్టిన ఒంటరీలో నేనున్నాననే ఓరిమి స్నేహం..
బాధలో బంధుత్వం..
ఆనందంలో ఆత్మీయ తత్వం..
అందరిలో అందరంగా అనుబంధాల అల్లుకున్న సమూహం స్నేహం..
ఒక్కరోజులో చెప్పలేనిభావం..
నిత్యం నిలిచి ఉండే జీవం..
ఈ స్నేహం...
మిత్రులందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు

## ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం

**హాజరుకానున్న పలువురు మంత్రులు.. గొట్టిపాటి రవికుమార్, డోల బాల వీరాంజనేయ స్వామి, ఆనం రామనారాయణ రెడ్డి**



(సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక : డిస్టిక్ స్టాఫ్ రిపోర్టర్)

ప్రకాశం జిల్లా గిద్దలూరు మార్కెట్ యార్డ్ ఆవరణలో నేడు సోమవారం కంభం, గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్లు బోర్డు డైరెక్టర్ల ప్రమాణస్వీకారం కార్యక్రమం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా కార్యక్రమానికి ముగ్గురు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోల బాల వీరాంజనేయ స్వామి, ఆనంరామనారాయణ రెడ్డి తో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఏర్పాట్లను పూర్తి చేశారు. నేడు గిద్దలూరు పట్టణంలో పసుపుదళం సందడి చేయనుంది. ప్రమాణ స్వీకారానికి ముందుగానే కంభం, బేస్తవారిపేట, కొమరోలు, గిద్దలూరు ప్రాంతాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రులు ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు భారీగా హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.